ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 28 డిసెంబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 19.4



వ్యవసాయ రంగం తడబాటు

మననం 2024

గత ఏడాది వానాకాలంలో పత్తిపంట రైతులను దెబ్బతీయగా, ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 9.27లక్ష ఎకరాల్లో పత్తి సాగైంది. అయితే ఎకరానికి 12క్వింటాళ్లకు బదులు కేవలం 6నుంచి 8క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చింది.ఒక్క నల్లగొండ జిల్లాలోనే 149191.39 మెట్రిక్ టన్నులను సీసీఐ కొనుగోలు చేసింది. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పత్తి, వరి అధికంగా సాగైంది. ఉమ్మడి జిల్లాలో 85లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేయగా, సు మారు 70లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టింది. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 10వేల ఎకరాలల్లో ఆయిల్‌పామ్ సాగు కాగా, సూర్యాపేట జిల్లాలో సుమారు 6వేల ఎకరాల్లో సాగైంది. రానున్న రోజుల్లో మరింతగా పంటలను విస్తరించి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. 65వ జాతీయ రహదారిపై నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మధ్య 200 ఎకరాల్లో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయాలని చూస్తోంది. ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్‌ను అమలులోకి తెచ్చింది.

యాసంగిపై బోలెడు ఆశలు

యాసంగి సీజన్‌పై రైతులు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మెట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు అతంత మాత్రంగా ఉండటం, విద్యుత్ అనధికార కోతలతో ఇబ్బందులు తప్పేలా లేవు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 23,74,280 ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. నల్లగొండ జిల్లాలో 11.50లక్షల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 6,24,280 ఎకరాలు, యాదాద్రి జిల్లాలో 6లక్షల ఎకరాలు ఉంది. యాసంగిలో కేవలం వరి పంట సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. నల్లగొండ జిల్లాలో సాగర్ ఆయకట్టుకు ఈ సీజన్‌లో కూడా నీటి విడుదల జరగనుండటంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. మెట్ట ప్రాంతాల్లో బోరు బావుల కింద రైతులు వరి సాగు చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో 2.31లక్షల ఎకరాలు బోరు బావుల కింద సాగవుతుండగా, 1.23 లక్షల్లో వర్షాధారంగానే పంటలు సాగవుతున్నాయి. భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి ప్రాంతాల్లో కొన్ని గ్రామాల్లో మూసీ నీటి ఆధారంగా రైతులు వరి...

- మిగతా 7వ పేజీలో...



ప్రకృతి మిగిల్చిన విషాదం

» తల్లడిల్లిన రైతులు » భారీ వర్షాలతో పంట నష్టం

ప్రకృతి ఈ ఏడాది మిగిల్చిన విషాదంతో రైతులు తల్లడిల్లారు. సెప్టెంబరు 1న ఎన్నడూ లేని విధంగా 30 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. దీంతో సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది. పంటపొలాలు వరదలో కొట్టుకుపోయాయి. వాగులు, వంకలకు గండ్లు పడి, చెరువు కట్టలు తెగిపోయాయి.

6 - (ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్)





'రైతు భరోసా'పై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేయగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 12.40లక్షల మందికి పెట్టుబడి సాయం అందింది. ప్రతీ సీజన్‌లో రూ.1600కోట్లకు పైగా అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గత ఏడాది ఎన్నికల కోడ్‌తో ఈ ప్రక్రియ నిలిచిపోగా, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 12 నుంచి జమచేయాలన్న ఆదేశాలతో అనేక ఆటంకాల నడు మ ఆ ఏడాది యాసంగికి సంబంధించిన పెట్టుబడి సాయం అరకొరగా అందింది. ఖజానాలో నగదు కొరత కారణంగా ఈ పథకం ముందుకు సాగలేదు. పార్లమెంటు ఎన్నికల ముందు రైతుల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏకకాలంలో రైతుబంధును విడుదల చేసింది. రైతు భరోసాపై మాత్రం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5వేలు రైతుబంధు ఇస్తే కాంగ్రెస్ ఎకరాకు రూ.7500 చెల్లిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా దీనిపై స్పష్టత లేదు. సంక్రాంతి పండుగ, లేదంటే ఆ తరువాత రైతు భరోసా ఇస్తామని, ప్రభుత్వం చెబుతున్నా, ఎన్ని ఎకరాలకు చెల్లిస్తుందనే దానిపై మార్గదర్శకాలు విడుదల చేయలేదు.

» గత ఏడాది కంటే మెరుగైన పంటల సాగు
» పెరిగిన ధాన్యం దిగుబడి » తగ్గిన పత్తి దిగుబడులు
» కొలిక్కిరాని రైతుభరోసా పథకం, రైతుల ఎదురుచూపు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయరంగం ఈ ఏడాది పలు ఆటుపోట్లను ఎదుర్కొంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆలస్యంగా వర్షాలు కురవడం, నాగార్జునసాగర్ సైతం ఆలస్యంగా వరద రావడంతో ఆయకట్టులో వరి సాగు ఆలస్యమైంది. ఖరీఫ్ ధాన్యం దిగుమతి పెరిగినా కొనుగోళ్ల సమయంలో సన్నాల రైతులు తొలుత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పత్తి దిగుబడి తగ్గింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ కావడం రైతులను కొంత ఊరటకు గురిచేసినా రైతు భరోసా పథకంపై ఎలాంటి ప్రణాళికలు రూపొందించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుల్లో కదలిక

నల్లగొండ జిల్లాలో శ్రీశైలం సొరంగమార్గంతో పాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుల్లో కదలిక మొదలైంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు టయల్‌రన్ ప్రారంభించడంతో పాటు కాల్వ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. మరో 10 శాతం పనులు మాత్రమే బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టులో మిగిలాయి. ఈ ప్రాజెక్టు కింద నకిరేకల్ నియోజకవర్గంలో 60వేల ఎకరాలకు, నల్లగొండ నియోజకవర్గంలో 25వేల ఎకరాలకు, మునుగోడు మండలానికి 10వేల ఎకరాలు, 5వేల ఎకరాల వరకు తుంగుతుర్తి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందనుంది. ఇక ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4500కోట్ల ను వెచ్చించాలని నిర్ణయించింది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా టన్నెల్ బోర్ మిషన్ బేరింగ్‌ను పరిశీలించడంతో పాటు దానిని తెప్పించడానికి కృషి చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి సొరంగ మార్గం పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ఆయకట్టుకు అమృత ధార

ఏడాది తొలినాళ్లలో బీడువారిన భూములు

కృష్ణమ్మ గలగలతో పసిడి సిరులు

దక్షిణ భారత జీవనాడి కృష్ణమ్మ రైతన్నల మోములో ఆనందాన్ని పారించింది. పంటలకు సెలవిచ్చిన భూములు ముళ్ల కంపలకు నెలవు కాగా, సుమారు రెండేళ్ల అనంతరం నిండుగా కురిసిన వానలతో నాగార్జునసాగరం నిండి పంటకాల్వలు పారాయి. దీంతో ఆయకట్టులో సిరుల పంటలు పండాయి. నల్లగొండ జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదలై రాష్ట్రానికే సాగర్ ఆయకట్టు పచ్చల హారంలా మారి రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది.

6 - (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)



నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



మహాసభల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఇతర యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీఎస్ యూటీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక మహాసభలకు రంగం సిద్ధమైంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన ప్రాంగణంలో 28,29,30 తేదీల్లో మూడు రోజులపాటు ఈమహాసభలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్‌సభ్యులు, నాయకులు ఈసభల్లో పాల్గొనేందుకు ఇప్పటికే నల్లగొండకు చేరుకున్నారు.

మహాసభల సందర్భంగా నల్లగొండ పట్టణంలో యూటీఎఫ్ పతాకాలు, తోరణాలు కట్టారు. ఆహ్వానసంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు ఈ సభల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. సభల తొలి రోజు ఉదయం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులతో నల్లగొండలో మహాప్రదర్శన నిర్వహించనున్నారు. 11 గంటలకు ప్రారంభమయ్యే సభకు ముఖ్యఅతిథులుగా శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నారు. అంతేగాక సభలో ఎంపీలు కుం దూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, రాష్ట్ర విద్యాక మిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డి కూడా ప్రారంభ సభ కు హాజరుకానున్నారు.

మధ్యాహ్నం 2.30 నుంచి మొదలయ్యే విద్యాసదస్సులో మాజీ ఎమ్మెల్సీ ప్రొ ఫెసర్ నాగేశ్వర్ 'భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలు' అనే అంశంపై ప్రసంగిస్తారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి' పూర్వ ఎడిటర్ డాక్టర్ కె.శ్రీనివాస్ 'విద్యలో రాజ్యాంగ విలువలు' అనే అంశంపై, ఎస్ఎఫ్ఐ జాతీయ సంయుక్త కార్యదర్శి అయిషీ ఘోష్ 'జాతీయ విద్యావిధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడరున్నారు. సాయంత్రం 6గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలకు సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరుకానున్నారు. రెండో రోజు 29న ఉదయం మహాసభల్లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య ప్రసంగించనున్నారు. ప్రతినిధుల సభలో పలు కమిటీల నివేదికలను సమర్పిస్తారు. 30న జరిగే ప్రతినిధుల సభలో నివేదికలపై చర్చతో పాటు జిల్లాల నివేదికలు, తీర్మానాలు, కర్తవ్యాలపై చర్చిస్తారు. అదే రోజు మధ్యాహ్నం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకొని సాయంత్రానికి మహాసభలను ముగిస్తారు.

విద్యారంగ సమస్యలపై చర్చ

నల్లగొండలో మూడురోజుల పాటు జరిగే...

- మిగతా 8వ పేజీలో...

మన్మోహన్ గొప్ప దార్శనికుడు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ గొప్ప దార్శనికవేత్త, సంస్కరణల పితామహుడని, ఆయన అస్తమయం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జూకూరి రమేష్, నాయకులు కత్తుల కోటి, బోడ స్వామి, మందడి శ్రీనివాస్ రెడ్డి, అల్లి సుభాష్ యాదవ్, శంకర్, వెంకన్న, కార్తీక్, రమేష్, అంజయ్య, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడి మృతి

- భర్త, కుమార్తెకు గాయాలు
- దైవ దర్శనం చేసుకుని వెళ్తుండగా విషాదం

6

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్ యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన వాయిదా

నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించాల్సిన జిల్లా స్థాయి సైన్స్ మేళాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఈవో బొల్లారం భిక్షపతి, సైన్స్ అధికారి వనం లక్ష్మిపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి సందర్భంగా వారం రోజుల పాటు సంతాప దినాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సైన్స్ మేళాను తాత్కాలికంగా వాయిదా వేశామని, త్వరలో తదుపరి తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు వాయిదా

నల్లగొండ పట్టణంలో శనివారం నిర్వహించనున్న కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సైతం వాయిదా వేస్తున్నట్టు పార్టీ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా కార్యక్రమాన్ని వాయిదా వేశామని, పార్టీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయంతోనే నష్టం

బీజేపీ నేత లక్ష్మణ్ 7

ఆవు పాలకు గేదె పాల బిల్లు

» మదర్ డెయిరీ అక్రమాలపై కొనసాగుతున్న విచారణ
» ఇప్పటికే ఆరుగురిపై సస్పెన్షన్ వేటు
» ప్రతీ నెల రూ.2 లక్షలు కాజేసినట్టు ఆరోపణలు

6

అర్ధాకలితో అలమటిస్తున్న జీపీ కార్మికులు

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున

నల్లగొండ రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులు నెలల తరబడి వేతనాలు రాక అర్ధాకలితో అలమటిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే వేతనాలను చెల్లించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో సమ్మెలో భాగంగా శుక్రవారం విధులను బహిష్కరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.


జీపీ కార్మికుల సమ్మెకు కేవీపీఎస్ తరఫున మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. జీపీ కార్మికులు పని గంటలతో నిమిత్తం లేకుండా రాత్రి వరకు పనిచేస్తున్నారని, వారు అత్యధిక శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. అతి తక్కువ వేతనం అయినా, నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో కార్మికులు 34 రోజులు సమ్మె చేయగా, నాడు కాంగ్రెస్ నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం అధికారంలో ఉన్నందున జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలె సత్యనారాయణ, కేవీపీఎస్ మండల కార్యదర్శి బొల్ల రవీంద్రకుమార్, ఎల్లేష్ అనిల్, రేణుక, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.





ఎండిపోయి..

ఈ ఏడాది మొదటి సీజన్‌లో సాగు నీటి కోసం రైతులు కటకటలాడాల్సి వచ్చింది. సాగర్ నుంచి నీటిని విడుదల చేయకపోతారా అన్న ఆశతో బోరు బావుల మీద మొదట్లో ఆధారపడి సాగును ప్రారంభించారు. అయితే తాగునీటి అవసరాల మేరకే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు ఉండటంతో సాగునీటికి విడుదల చేయలేదు. దీంతో భూములు బీళ్లుగా మారాయి. కొన్ని చోట్ల రైతులు సగం పంటను పశువుల మేతకు వదిలేశారు. కొన్నిచోట్ల నీటి కోసం రూ.వేలాది వెచ్చించి బోర్లు వేయించారు. ఆశించిన మేర నీరు పడక ఆయకట్టు రైతులు తీవ్ర నష్టాలను, కష్టాలను ఎదుర్కొన్నారు.



నిండిపోయి

కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో జూలై నుంచి వర్షాలు మొదలయ్యాయి. కర్ణాటక రాష్ట్రంలో భారీ వర్షాలకు రిజర్వాయర్లు నిండి లక్షల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో కొద్దిరోజుల్లోనే నిండిపోయాయి. అనంతరం కురిసిన వర్షాలకు మరింత వరద తోడు కావడంతో కాల్వలకు నీటిని వదిలారు. దీంతో భవిష్యత్ సాగుపై భరోసా ఏర్పడింది.



కొట్టుకుపోయి

అంతా సాఫీగా 'సాగు'తున్న కాలంలో సెప్టెంబరు 1లో కురిసిన భారీ వర్షాలు రైతులను ఒక్క కుదుపునకు గురిచేశాయి. ఎన్నడూ లేనంతగా ఒక్కటి, రెండు రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు తెగిపోయాయి. సూర్యాపేట జిల్లా పరిధిలోని సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో ముక్త్యాల బ్రాంచ్‌పై మూడు చోట్ల, నడిగూడెం మండలం కాగితరామచంద్రా పురం వద్ద కాల్వకు గండ్లు పడి వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. కాల్వ వెంట ఉన్న పొలాల్లో ఇసుక, రాళ్లు మేటలు వేసి తీర్చుకోలేని బాధను మిగిల్చాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించినా అది కొంతమేరకే రైతులకు ఉపశమనం కలిగించింది.

కన్నీరు పెట్టించింది

- మొదట్లో రైతు కంట్లో, ఆపై కాల్వల్లో...
- ఏడాది తొలినాళ్లలో బీడువారిన భూములు
- కృష్ణమ్మ పరవళ్లతో పసిడి సిరులు

మననం 2024

తొలినాళ్లలో కరువుతో రైతులను కష్టాల పాల్జేసినా కృష్ణమ్మ నడికారులో అన్నదాతలను ఆదుకుని వారి మోములో ఆనందాన్ని పారించింది. పంటలకు సెలవిచ్చిన భూములు ముళ్ల కంపలకు నెలవులుగా మారిన సమయంలో సుమారు రెండేళ్లకు సరిపడా నిండుగా కురిసిన వానలు రైతులకు భవిష్యత్‌పై భరోసా కల్పించాయి. సాగునీరు విడుదలై సాగర్ ఆయకట్టు పచ్చలహారంలా మారింది. ప్రస్తుతం వానాకాలం పంట నూర్పిళ్లు పూర్తిచేసుకున్న రైతులు యాసంగి నాట్లలో తలమునకలయ్యారు.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ)

వర్షాలు కురవక నాగార్జునసాగర్ జలాశయంలో 515 అడుగులకు నీటిమట్టం పడిపోయినప్పటికీ ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తారన్న ఆశాభావంతో బోరుబావుల కింద రైతులు గత ఏడాది డిసెంబరు, జనవరిలలో యాసంగి పంటలను సాగు చేశారు. అయితే నీరు విడుదల లేకపోగా, అధికారులు ఆయకట్టుకు క్రాప్ హాలీడే ప్రకటించారు. కాగా యాసంగి సాగు చేసిన బోరు బావుల రైతుల భూగర్భజలాలు అడుగంటడం, బోర్లు పోయక పోవడంతో పెద్దసంఖ్యలో ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి పంటలను తడుపుకోవడానికి రైతులు నానాతంటాలు పడ్డారు. ఫిబ్రవరి, మార్చి నాటికే చెరువులు ఎండిపోయి బీటలు వారడంతో పశువులకు సైతం నీరందక ఇబ్బందులు ఎదురయ్యాయి. పొట్ట దశలో వరి పైరు వాడుతుండటంతో ఈత వేసిన గింజలు తాలుగా మారి దిగుబడి పూర్తిగా తగ్గింది. పెట్టుబడి కూడా దక్కని పరిస్థితుల్లో రైతులు వేములపల్లి, మిర్యాలగూడ మండలాల్లో కొన్నిచోట్ల పంటలను తగులబెట్టారు. ఆయకట్టులో రోజుకు సుమారు 200లకు పైగా రైతులు బోర్లు వేయించగా నీరుపడని పరిస్థితి కనిపించింది. అనేకమంది 7,8 చోట్ల బోర్లు వేసినా చుక్క నీరు బయటకు రాక లక్షలాది రూపాయలు ఆర్థికంగా నష్టపోయారు.

కాల్వకట్టల నిర్వహణపై నీలినీడలు

వరుణుడి కరుణతో నాగార్జునసాగర్ నిండినా ఎడమ కాల్వ నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడం ఆయకట్టుకు శాపంగా మారుతోంది. గతంలో ప్రపంచ బ్యాంకు , రాష్ట్ర ప్రభుత్వ నిధులు 4444.41 కోట్లతో కాల్వ ఆధునీకీకరణ మొదలుపెట్టినా నిధులు చాలక కాల్వ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. మట్టికట్టల లైనింగ్ పనులు పూర్తి కాకపోవడం, తరుచుగా కట్టలు కోతకు గురవడంతో చివరి భూములకు నీరందడం లేదు. కాల్వలో నీరు విడుదల లేని సమయంలో కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ వరకు పూర్తి చేయాల్సి ఉండగా, పూర్తికాకపోవడంతో మరో ఏడాది గడువు పొడిగించారు.

డిజైన్ డిశ్చార్జి కంటే తక్కువ నీరు విడుదల

సాగర్ ఎడమకాల్వ డిజైన్ ప్రకారం 11వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంది. ఎడమకాల్వ ఆయకట్టు స్థిరీకరణ 10,37,796ఎకరాలు కాగా నల్లగొండ, ఖమ్మం జిల్లాలో 6,62,580 ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎడమకాల్వ ద్వారా(లిఫ్టులతో కలిసి) 3,60,701 ఎకరాల భూములకు సాగునీరు అందుతుంది. కాల్వ కట్టలు బలహీనంగా ఉండటంతో ఏ రోజూ పూర్తిస్థాయి నీటి విడుదల జరగలేదు. 8 నుంచి 9 వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. మేజర్లకు నీటిపారుదల ప్రాంతాన్ని బట్టి 80 క్యూసెక్కులకు మించి విడుదల చేయలేదు. దీంతో సుమారు 60వేల ఎకరాల ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

కదిలి వచ్చిన కృష్ణమ్మ

ఎగువన భారీ వర్షాలతో కృష్ణమ్మ మెల్లగా సాగర్‌కు కదిలివచ్చింది. మే 28 నాటికే అధికవర్షపాతం నమోదవుతుందని అంచనా వేసినా చిరుజల్లులతోనే సరిపుచ్చాయి. కరువు పరిస్థితులు వస్తాయేమోనని రైతులు భయపడుతున్న సందర్భంలో కర్ణాటక రాష్ట్రాన్ని జూలైలో భారీ వర్షాలు ముంచెత్తి ఆల్మట్టి డ్యామ్‌లోకి పూర్తిస్థాయిలో నీరుచేరింది. దీంతో దిగువకు నీరు విడుదల చేయడంతో సాగర్ ఆయకట్టు రైతులు ఆగస్టుపై ఆశలు నిలుపుకున్నారు. ఆశించిన వర్షాలు రాష్ట్రంలో కురవకపోయినా ఎగువ ప్రాంతాల నుంచి భారీవరద సాగర్‌కు వస్తుండటంతో ఆగస్టు 2న ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు. కాల్వ ద్వారా నీరు మడికి చేరే సమయానికి ఆగస్టు, సెప్టెంబరులో రాష్ట్రంలో భారీవర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాయి. ఈ సీజన్‌లో నాలుగుసార్లు పూర్తిస్థాయిలో సాగర్‌గేట్లు ఎత్తి నీటి విడుదల చేశారు.

ఎత్తిపోతల నిర్వహణపై...

ఎడమకాలపై మిర్యాలగూడ డివిజన్‌లో ఏర్పాటుచేసిన లిఫ్ట్(ఎత్తిపోతల)ల ద్వారా 80వేల ఎకరాలు సాగు నీరు అందించాల్సి ఉంది. అయితే వాటి నిర్వహణ రైతులకు భారంగా మారడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకమైంది. కాగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నెల్లికల్ ఎత్తిపోతల ద్వారా తొలి దశలో 5,400ఎకరాల నూతన ఆయకట్టుకు, మిర్యాలగూడ నియోజకవర్గంలో ఐదు లిఫ్టులకు కొత్తగా ఈ ఏడాది శంకుస్థాపనలు చేశారు. వీటిద్వారా 25వేల ఎకరాల ఆయకట్టు చివరి భూములకు నీరందించాలని సంకల్పించినా, దీర్ఘకాలిక నిర్వహణపై ప్రజల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి.

గిట్టుబాటు తడబాటు

ధాన్యం ధరల్లో హెచ్చుతగ్గులు రైతును నిలువునా ముంచాయి. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ ప్రకటించినప్పటికీ కొనుగోలు నిబంధనల కారణంగా రైతులు ఎక్కువగా మిల్లుపాయింట్ల వద్దకే ధాన్యాన్ని తీసుకెళ్లారు. తొలిదశలో క్వింటాకు రూ.2500 వరకు కొనుగోలు చేసిన మిల్లర్లు ఆ తర్వాత ధర తగ్గించడంతో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వ యంత్రాంగం జోక్యంతో మిల్లర్లు దిగివచ్చారు. చివరిదశలో ప్రభుత్వ బోనస్‌తో కలిపి రూ.100 అదనంగా కలిపి రూ.3000 వరకు కొనుగోలు చేశారు.



రైతుల్లో ప్రకృతి ప్రకోపం విషాదాన్ని నింపింది. ఈ ఏడాది సెప్టెంబరు 1న భారీ వర్షం కురిసింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 30 సెంటీమీటర్ల వర్షం ఒక్క రాత్రిలో కురవడంతో సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది. వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, వాగులు, వంకలకు గండ్లుపడ్డాయి. చెరువు కట్టలు తెగిపోయాయి. కోట్లాది రూపాయల పంట నష్టంతో పాటు ప్రజాధనం, అన్నదాతల శ్రమ భారీ వర్షాలకు కకావికలమైంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

అకాల భారీ వర్షాలకు నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఎన్నడూ లేనివిధంగా ఆస్తి, పంటనష్టాలు చోటుచేసుకున్నాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ముక్త్యాల బ్రాంచ్ కాల్వకు రెండు చోట్ల, ప్రధాన ఎడమకాల్వపై నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపంలోని 132వ కిలోమీటరు, అదేవిధంగా ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం 134వ కిలోమీటర వద్ద గండ్లు పడ్డాయి. పాలేరు రిజర్వాయరు నీరు వెనక్కి రావడంతో నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద కాల్వ తెగి రత్నవరం, నడిగూడెం ప్రాంతంలో రెండు వేల ఎకరాలకు పైనే పంట నష్టం జరిగింది.100 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. ప్రస్తుతం ఇసుక మేటలు వేసిన పొలాలు అలాగే ఉన్నాయి. అయితే అధికారులు మాత్రం నడిగూడెం మండలంలో 210ఎకరాల్లో మాత్రమే పంట నష్టం జరిగినట్లు నివేదికలు అందించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఎడమ కాల్వకు అనుసంధానమైన ముక్త్యాల బ్రాంచ్ కాల్వపై 14.63వ కిలోమీటరు వద్ద యూటీ పక్కన గండిపడి వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అదేవిధంగా 22వ కిలోమీటర్ వద్ద ఆధునీకరణ చేసిన చోట కోతకు గురికాగా 24వ కిలోమీటరు వద్ద మరో గండిపడింది. 14వ కిలోమీటరు వద్ద గండితో కరక్కాయలగూడెం, మర్రిగూడెం, బూరుగడ్డ, గోపాలపురం, లింగగిరి, శ్రీనివాసపురం, అమరవరం, యాతవాకిళ్ల ప్రాంతాల్లోని చాలాఎకరాల్లో పంట దెబ్బతింది. అదేవిధంగా భారీ వర్షాలకు కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు, కోదాడ మండలం తొగర్రాయి తదితర గ్రామాలతో పాటు హుజూర్‌నగర్ నియోజకవర్గం గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో భారీగా పంట నష్టం జరిగింది.

కొండంత నష్టం..

భారీ వరదలకు సూర్యాపేట జిల్లాలో జరిగిన నష్టానికి అధికారుల అంచనాకు పోలిక లేదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా 9,800 ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. 10,993మంది రైతులకు రూ.9.80కోట్లు పరిహారంగా అందజేశారు. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ నల్లచెరువుకు గండిపడి సుమారు 1000ఎకరాలకు పైనే పంట నష్టం జరిగింది. అదేవిధంగా హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని బట్టవారికుంట చెరువుకట్ట తెగి 400 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఎంబీ కెనాల్ పరిధిలోని 14వ కిలోమీటరు వద్ద గండితో 800 ఎకరాలలో పంటనష్టం జరిగింది. ఈ గండి వల్లే బూరుగడ్డ నల్లచెరువుకు గండిపడి వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో వరదలకు 30వేల ఎకరాలు కొట్టుకుపోయినట్లు రైతుసంఘాలు పేర్కొంటున్నాయి. రూ.30 కోట్లు పరిహారం అందించాల్సి ఉండగా మూడో వంతు మాత్రమే రైతులకు పరిహారం అందించారని ఆరోపిస్తున్నాయి. ఇదిలా ఉండగా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద ప్రధాన కాల్వకు పడిన గండిని 20 రోజులకు పూర్తి చేయగలిగారు. దీంతోపాటు నాయకన్‌గూడెం వద్ద గండిని కూడా పూడ్చడంలో అధికారులు తీవ్ర జాప్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. కాగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాలో తెగిన ఎడమ కాల్వ ప్రాంతాలను మూడుసార్లు సందర్శించారు. గంటల తరబడి సమీక్షించి పనుల్లో వేగం పెంచేలా చూశారు. అయినప్పటికీ అధికారులు గండిపూడ్చివేతలో జాప్యం చేశారన్న విమర్శలు వచ్చాయి.

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సైతం నెలరోజుల పాటు కాల్వలు, చెరువులు, పొలాలను, రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో పనులను పర్యవేక్షించి పూర్తి చేసేందుకు నిరంతరం శ్రమించారు.



రూ.10 వేలతో చేతులు దులుపుకున్నారు


సూర్యాపేట జిల్లాలో వరద సహాయం కింద ఎకరానికి రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కేంద్ర బృందం వచ్చి పరిశీలించినా నేటికీ ఒక్క రూపాయి కేటాయించకపోవడం శోచనీయం. రైతులను ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయి. 30వేల ఎకరాలకు పైనే పంట నష్టం జరిగింది. కానీ అధికారులు 10వేల ఎకరాలకే రూ.10వేలు ఇవ్వడం అపహాస్యం చేయడమే.

గన్నా చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు

మూడో వంతు రైతులకే పరిహారం

ప్రభుత్వం వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 30వేల ఎకరాలకు పైగా జరిగితే 10వేల ఎకరాలకే నష్టపరిహారం ఇవ్వడం సరికాదు. నాలుగు నెలలుగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీసం కొత్త సంవత్సరంలో అయినా రైతులను ఆదుకుని చేయూత అందించాలి.

పల్లె వెంకటరెడ్డి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి





కాగితరాంచంద్రాపురంలో గండిపడిన ఎడమ కాల్వ(ఫైల్)

ప్రియుడితో కలిసి భర్త హత్య



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్, ఎస్ఐ రాజు

డిండి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా డిండి మండలం దేవత్‌పల్లితండాలో ఈ నెల 23న జరిగిన యువకుడి హత్య కేసులో మిస్టరీ వీడింది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. శుక్రవారం డిండి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేష్ వివరాలు వెల్లడించారు. దేవత్‌పల్లితండాకు చెందిన రమావత్ కుమార్‌కు 10ఏళ్ల కిందట క్రితం చందంపేట మండలం పోల్యానాయక్‌తండాకు చెందిన లక్ష్మి(పొట్టి)తో వివాహమైంది. ఏడాది కిందట జీవనోపాధి కోసం కుమార్, లక్ష్మి దంపతులు హైదరాబాద్‌కు వెళ్లారు. కుమార్ ఆటో నడుపుతుండగా లక్ష్మి తాపీమేస్త్రీ వద్దకు కూలీ పనులకు వెళ్లేది. ఈ క్రమంలో ఆమెకు మేస్త్రీ వంగాల మధుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో కుమార్, లక్ష్మి దంపతుల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. విసుగుచెంది కుమార్ క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మెరుగైన చికిత్స అందించడంతో కోలుకున్నాడు. దీంతో కుల పెద్దలు ఇద్దరికి సర్దిచెప్పి సొంత గ్రామమైన దేవత్‌పల్లితండాకు రెండు నెలల క్రితం పంపించారు. తనకున్న వ్యవసాయ భూమిలో కుమార్ యాసంగిలో వేరుశనగను సాగు చేశాడు. భార్యాభర్తలు రోజూ పొలానికి నీరు పెట్టేందుకు రాత్రి 9 గంటల సమయంలో వెళ్తుంటారు. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్త కుమార్‌ను అంతం చేసేందుకు భార్య లక్ష్మి పథకం వేసింది. ఈ నెల 23న రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలానికి నీళ్లు పెట్టేందుకు కుమార్, లక్ష్మి పొలానికి వెళ్లారు. అప్పటికే పొలంలో లక్ష్మి ప్రియుడు తుంగతుర్తి మండలం వెలుగుపల్లికి చెందిన తాపీ మేస్త్రీ వంగాల మధు, అతడి స్నేహితుడు హైదరాబాద్ మొహిదీపట్నం గుడిమల్కాపూర్‌కు చెందిన నల్లరపు సాయికిరణ్ మాటువేసి ఉన్నారు. పొలం వద్ద కుమార్ నిద్రిస్తున్న సమయంలో భార్య లక్ష్మి, ప్రియుడు మధు, అతడి స్నేహితుడు సాయికిరణ్‌లు దాడిచేసి హత్య చేశారు. కుమార్‌ది ఆత్మహత్యగా నమ్మించేందుకు పొలంలో చీరతో చెట్టుకు ఉరివేశారు. అదే రాత్రి తండాకు చేరుకొని కుమార్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు లక్ష్మి గ్రామస్థులకు తెలిపింది. తండావాసులు పొలానికి చేరుకొని చెట్టుకు వేలాడుతున్న కుమార్ మృతదేహాన్ని తండాకు తరలించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. భార్య లక్ష్మిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించింది. ఆమెతో పాటు మధు, సాయికిరణ్‌లను రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. కేసు మిస్టరీని ఛేదించిన సీఐ సురేష్, ఎస్ఐ రాజు, సిబ్బందిని డీఎస్పీ గిరిబాబు అభినందించగా ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

భార్యకు ఫోన్ చేసి బలవన్మరణం

ఈ నెల భువనగిరిలో 18న ఘటన ● చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

భువనగిరి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని ఎస్వీ లాడ్జిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన కర్రె రాజిరెడ్డి (45) ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి కొద్దికాలంగా హైదరాబాద్ బోయినపల్లి ఉమానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 16వ తేదీన ఇంటిని వీడిన రాజిరెడ్డి మరుసటి రోజు వరకు ఇంటికి వెళ్లకపోవడంతో భార్య కర్రె సరళ బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో 17వ తేదీన ఫిర్యాదు చేసింది. దీంతో అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన తెల్లవారుజామున 2గంటలకు రాజిరెడ్డి భార్యకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందును తాగుతూ వీడియో కాల్ చేసి అడ్రస్ చెప్పాడు. దీంతో ఆమె ఏడుస్తూ అడ్రస్ చెప్పాలని ప్రాధేయపడగా భువనగిరి ఎస్వీ లాడ్జి లొకేషన్‌ను షేర్ చేశాడు. ఆమె ఇచ్చిన సమాచారంతో భువనగిరి పట్టణ పోలీసులు ఎస్వీ లాడ్జికి చేరుకొని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దైవదర్శనం చేసుకుని వెళ్తుండగా విషాదం

- రోడ్డు ప్రమాదంలో తల్లీ కుమారుడి మృతి
- భర్త, కుమార్తెకు గాయాలు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



ఇదే చివరి ఫొటో

ప్రమాదానికి కొద్ది గంటల ముందు తీయించుకున్న ఫ్యామిలీ ఫొటోలో జగన్, పావని, కన్నయ్య, సాత్విక

భువనగిరి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం ఇంటికి వెళుతుండగా లారీ ఢీకొని తల్లీ కుమారుడు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రాయిగిరి శివారులో ఈ సంఘటన జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వి.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చెంపాపేటకు చెందిన బహిగల్ల జగన్, భార్య పావని(30), కుమారుడు కన్నయ్య(3), కుమార్తె సాత్విక(8) శుక్రవారం యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చారు. దైవ దర్శనం అనంతరం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా భువనగిరి మండలం రాయిగిరి సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పావని అక్కడికక్కడే మృతిచెందింది. కన్నయ్యను ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. జగన్, సాత్విక గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



గోవిందు(ఫైల్ ఫొటో)

నేరేడుగొమ్ము, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. ఎస్ఐ సతీష్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాచరాజుపల్లికి చెందిన బద్దెల గోవిందు (48) రోజువారీగా శుక్రవారం తన పొలానికి వెళ్లాడు. సమీపంలో ఉన్న మహిళా రైతు నీల పొలంలో విద్యుత్ వైరు తెగిపడి ఉండటంతో ఆమె గోవిందుకు విషయాన్ని తెలియజేసింది. తెగిపడిన విద్యుత్ వైరుకు మరమ్మతులు చేస్తున్న క్రమంలో గోవిందు విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న నీల, మరికొంతమంది రైతులు గోవిందును దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గోవిందుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఆవు పాలకు గేదె పాల బిల్లు

- ఇప్పటికే ఆరుగురిపై సస్పెన్షన్ వేటు
- ప్రతి నెలా రూ.2 లక్షలు కాజేసినట్లు ఆరోపణలు



నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల మదర్ డెయిరీ పరిధిలోని భువనగిరి మిల్క్ చిల్లింగ్ పరిధిలో అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. భువనగిరి కేంద్రంలో ఉద్యోగులు లక్షల రూపాయలు అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి ఆరుగురు ఉద్యోగులపై వేటు వేసి విచారణకు ఆదేశించారు. ఈ డెయిరీ కేంద్రం కింద 13 పాలకేంద్రాలు ఉన్నాయి. ప్రతి రోజూ దాదాపు 4వేల లీటర్ల పాలను సేకరిస్తారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి పరిధిలోని ఎంబావి పాలకేంద్రం నుంచి వచ్చే ఆవు పాలను, గేదె పాలుగా చూపించి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. చైర్మన్‌తో పాటు ఇద్దరు సూపర్‌వైజర్లు, వెన్న శాతం లెక్కించే మరో ముగ్గురు సిబ్బందితో కలిసి అవినీతికి పాల్పడినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఈ ఏడాది జులై వరకు ఆయా కేంద్రాలకు 400 లీటర్ల వరకు ఆవు పాలు వచ్చేవి అయితే ఆగస్టు నుంచి పూర్తిగా గేదెపాలు పోస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. దాదాపు నాలుగున్నర నెలలుగా 400 లీటర్ల వరకు ఆవు పాల దిగుబడి రాగా ఒక్కసారిగా దిగుబడి ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు రికార్డులు తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం సేకరించిన 400 లీటర్ల ఆవు పాలను గేదె పాలుగా చూపించి రికార్డుల్లో నమోదు చేసి, అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. ప్రతి నెలా రెండు లక్షల చొప్పున అక్రమాలకు పాల్పడి దాదాపు రూ.10 లక్షలను స్వాహా చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఆరుగురిపై మదర్ డెయిరీ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ విషయంపై మదర్ డెయిరీ ఎండీ కృష్ణను వివరణ కోరగా తాను ప్రస్తుతం సెలవుల్లో ఉన్నానని, చైర్మన్ ఆదేశాల మేరకు విచారణ సాగుతుందని తెలిపారు.

ట్రాక్టర్ నాగలికర్రు గొంతులో చిక్కుకుని యువ రైతు మృతి


- 50 మీటర్లు ఈడ్చుకెళ్లిన డ్రైవర్



లెనిన్ (ఫైల్)

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ నాగలి కర్రు గొంతులో గుచ్చుకుని యువ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా 50 మీటర్లకు పైగా నాగలి కర్రు గొంతులో ఉండగానే ఈడ్చుకెళ్లాడు. శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో ఈ హృదయ విదారక సంఘటన జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు కలగాని లెనిన్(28), తన భార్య, కుమారుడితో కలిసి గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి శుక్రవారం రాత్రి బైక్‌పై వస్తున్నాడు. రామన్నగూడెం నుంచి నాగళ్లతో వస్తున్న గుర్తుతెలియని ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో ట్రాక్టర్ వెనకవైపు ఉన్న నాగలికర్రు లెనిన్ గొంతులో దిగింది. ద్విచక్ర వాహనంతో పాటు భార్య, కుమారుడు కింద పడగా నాగలికర్రు గుచ్చుకున్న లెనిన్‌ను సుమారు 50మీటర్లు ట్రాక్టర్ ఈడ్చుకెళ్లాడు. సదరు ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని నిలిపి నాగలికర్రుకు ఉన్న లెనిన్‌ను కర్రు నుంచి ఊడదీసి పక్కన పడేసి ట్రాక్టర్‌తో పరారయ్యారని ఎస్ఐ తెలిపారు.భార్య, కుమారుడు రోదించడంతో గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. రాత్రి సమయం కావడంతో ట్రాక్టర్ కనిపించకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లెనిన్ మృతదేహాన్ని సూర్యాపేట ఆసుపత్రికి పోస్టుమార్టమ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు..



మహేష్(ఫైల్)

హాలియా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియాలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు.పోలీసుల కథనం ప్రకారం అనుముల మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన పుట్టా మహేష్(22), లిఫ్ట్ అడిగి ప్రయాణిస్తున్న బాబి బైక్‌పై గ్రామానికి వెళ్తున్నారు. అదేసమయంలో అదేగ్రామానికి వెళ్తున్న ట్రాక్టర్‌ను అతివేగంగా వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో మహేష్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాబీకి తీవ్రగాయాలు కావడంతో అతడిని 108 వాహనంలో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహేష్ కూలీ పనులు చేసేవాడని, అవివాహితుడు కాగా తల్లితండ్రులకు ఏకైక కుమారుడిగా తెలిపారు. మహేష్‌ను మృతితో తల్లితండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

తాగిన మైకంలో యువకుల ఘర్షణ

తిప్పర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాతో దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అనిశెట్టిదుప్పలపల్లికి చెందిన నకిరేకంటి మహేష్ వాహనానికి అదేగ్రామానికి చెందిన రాఘవేంద్ర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చేసిన పనికి డబ్బులు ఇవ్వాలని రాఘవేంద్ర శుక్రవారం మధ్యాహ్నం మద్యం సేవిస్తూ మహేష్‌ను నిలదీశాడు. తాగిన మైకంలో రాఘవేంద్రపై మహేష్ మద్యం సీసాతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఘటనపై మహేష్ తల్లి సుమాల్య ఫిర్యాదు మేరకు మహష్, అతడికి సహకరించి శ్రీకాంత్, జిల్లా శ్రీనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ ఏర్పాటులో
మన్మోహన్‌సింగ్‌ది కీలకపాత్ర

● నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆర్థిక సంస్కరణల యోధుడు మన్మోహన్‌సింగ్ అస్తమయం జిల్లా నేతలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన చేసిన సేవలు, ఆయనతో కలిసి పోరాటంలో పాల్గొన్న తీరును పలువురు గుర్తు చేసుకున్నారు.



ఢిల్లీలో మన్మోహన్‌సింగ్‌తో కలిసి ఆందోళనలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటులో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ క్రియాశీలపాత్ర పోషించారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో తెలంగాణ ఆవశ్యకతను సోనియాగాంధీతో పాటు మన్మోహన్‌సింగ్‌కు వివరించానని తెలిపారు. మన్మోహన్‌సింగ్ రాష్ట్ర ఏర్పాటుకు సానుకూలం వ్యక్తం చేశారన్నారు. ఢిల్లీకేంద్రంగా మన్మోహన్‌తో కలిసి ఆందోళనలు చేశామన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, సమాజానికి తీరనిలోటన్నారు. మన్మోహన్‌తో కలిసి ఢిల్లీలో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వివరించారు.

కాంగ్రెస్ అభ్యర్థుల బహిరంగ సభకు హాజరు


మన్మోహన్‌తో వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

భువనగిరి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్ సింగ్ 2014 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు భువనగిరికి వచ్చారు. భువనగిరి మండలం కూనూరు శివారులో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. భువనగిరి పరిసర నియోజకవర్గాలైన భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, జనగాం నియోజకవర్గాలను కలిపి భువనగిరి కేంద్రంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఈ బహిరంగ సభలో పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు: గుత్తా

నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి భారత దేశానికి తీరని లోటు అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థికశాఖ మంత్రిగా సంస్కరణలను అమలుచేసి దేశం అభివృద్ధి పథంలో నడవడానికి పునాదులు వేశారన్నారు. మన్మోహన్‌సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి విచారకరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది : జానారెడ్డి


మన్మోహన్‌సింగ్‌తో కుందూరు జానారెడ్డి

హాలియా, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారతదేశం గొప్ప ఆర్థికవేత్త, సంస్కరణల కర్త అయిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కోల్పోవడం చాలా బాధాకరమని సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో తాను పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌కు వచ్చిన మన్మోహన్ సింగ్‌కు వ్యవసాయంపై సంస్కరణల గురించి వివరించానని చెప్పారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగల నుంచి రూ.31,13,877 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్య విమాన రాజగోపురానికి హైదారాద్‌కు చెందిన నరసింహారెడ్డి, రమాదేవి దంపతులు రూ.5లక్షల చెక్కు విరాళంగా అందజేశారు.

నేటి నుంచి ఏపీజీవీబీ సేవలు బంద్

భువనగిరి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు (టీజీబీవి)గా పేరుమార్చుకుంటున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)లో నేటి నుంచి నాలుగు రోజులపాటు బ్యాంకింగ్ కార్యకలాపాలు స్తంభించనున్నాయి. టీజీబీవీకి అనుగుణంగా సాఫ్ట్‌వేర్, కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ అప్‌డేట్ తదితర ఏర్పాట్లకోసం ఈ నెల 28, 29, 30, 31వ తేదీల్లో బ్యాంకులను బంద్ చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని సుమారు 35 ఏపీజీవీబీ సేవలు స్తంభించనున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 3.70లక్షల మంది ఖాతాదారులున్నారు. ఈ నాలుగు రోజుల పాటు ఏటీఎం, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ తదితర ఎలాంటి సేవలు అందుబాటులో ఉండవు. ఈ మేరకు 1 జనవరి 2025 నుంచి రాష్ట్రంలో ఏపీజీవీబీ పేరు కనుమరుగు కానుంది. టీజీవీబీగా రూపాంతరం చెందాక ప్రస్తుత సేవలన్నీ కొనసాగుతాయని, త్వరలోనే మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ చెన్న తెలిపారు. అలాగే ఇప్పటివరకు ప్రతీ బ్రాంచ్‌కి వేర్వేరుగా ఉన్న ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఇకనుంచి ఒకే కోడ్‌గా ఉండనుంది.

రూ.కోట్లు కుమ్మరిస్తున్నా..
రక్షణ కరువాయె!

● రెండు శాఖల మధ్య సమన్వయ లోపం ● పెద్దగట్టు నిర్వహణ అస్తవ్యస్తం


మరుగుదొడ్లకు తలుపులు కరువు


నల్లాలులేని నీటి సరఫరా దిమ్మె

భానుపురి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సమ్మక్క, సారక్క జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతరగా పేరున్న గొల్లగట్టుకు రక్షణ లేకుండా పోతోంది. సూర్యాపేట పట్టణంలోని నాలుగో వార్డులో ఉన్న పెద్దగట్టు లింగమంతులస్వామి (గొల్లగట్టు) జాతర ప్రతీ రెండేళ్లకో సారి జరుగుతుంది. జాతర సమయాల్లో రూ.కోట్లు ఖర్చు చేస్తూ నిర్మించిన కట్టడాలు.. దేవాలయానికి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, నల్లాలు, నీటి ట్యాంకులు, కోనేరు, విద్యుత్ దీపాలు, సోలార్ దీపాలకు రక్షణ లేకుండా పోతుంది. వీటిని కాపడానికి మునిసిపాలిటీగాని, దేవదాయశాఖగాని నిఘా పెట్టకపోవడంవల్ల చోరీకి గురవ్వడం, ధ్వంసం చేయడం జరుగుతోంది. సూర్యాపేట పట్టణానికి సమీపంలోనే ఉన్న లింగమంతుల స్వామి దేవాలయానికి నిత్యం భక్తులు వచ్చిపోతుంటారు. అయినా కూడా సరైన పర్యవేక్షణ లేకపోవడంతో భక్తులు అడపాదడపా వచ్చిపోతున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తే సూర్యాపేట పట్టణవాసులతో పాటు ఇతర గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి దేవుళ్లను దర్శనం చేసుకుని సేదతీరే అవకాశాలు కన్పిస్తున్నాయి. మున్సిపాలిటీ, దేవదాయ శాఖలు దృష్టి సారించడం లేదు. దేవదాయశాఖ తమకు వచ్చే ఆదాయం జాతర ఏర్పాట్లకు సరిపోతుందని, మున్సిపాలిటీ మాత్రం తమకు జాతరకు వచ్చే ఆదాయం శానీటరి ఇతర సౌకర్యాలకు సరిపోతుందని చెబుతూ పెద్దగట్టును గాలికి వదిలేస్తున్నారు. చీకటి పడితే గుట్టప్రాంతం చీకటిమయంగా మారుతోంది. జాతర అయిపోయిన తర్వాత పెద్దగట్టు చుట్టూ, రెండు రహదారుల సమీపంలో ఉన్న నీటిసరఫరా నల్లాలు, మూత్రశాలలు, నీటి ట్యాంకులు, కోనేరు, ఇతర షెడ్ల నిర్వహణకు మునిసిపల్ సిబ్బంది ఇద్దరిని నియమించినా మరో జాతర వచ్చే వరకూ ఉపయోగపడే అవకాశం ఉంది. అలా ఇద్దరిని కేటాయించకపోవడంవల్ల ఆకతాయిలు, దొంగలు ధ్వంసం చేయడం జరుగుతోంది. రెండేళ్లకోసారి వచ్చే జాతరని మునిసిపాలిటీ శాఖ, దేవదాయశాఖ పర్యవేక్షణ మరిచిపోతున్నాయి. ప్రభుత్వం కేటాయించే నిధులను శాశ్వత నిర్మాణాలకు ఉపయోగించే అవకాశమున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దేవాలయ కమిటీ సైతం శాశ్వత కమిటీలను ఏర్పాటు చేయకుండా జాతర సమయాల్లోనే తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేయడంతో పట్టు సాధించే లోపే జాతర పూర్తవుతుంది. ప్రతీ జాతరకు రూ.కోట్లు కేటాయించి పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తే అధికారులు, రాజకీయ నాయకులకు మాముళ్లు ముట్టజెప్పి నాణ్యతలేని పనులు చేస్తున్నారని విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.


రెండుశాఖల మధ్య సమన్వయ లోపం

పెద్దగట్టు(లింగమంతులస్వామి) రెండు శాఖల మధ్య నలిగిపోతుంది. పెద్దగట్టును మునిసిపాలిటీ, దేవదాయశాఖలు పంచుకుంటున్నాయి. పైభాగం దేవదాయశాఖ, కింది భాగాన్ని సూర్యాపేట మునిసిపాలిటీ పర్యవేక్షణ చేస్తున్నాయి. తైబజార్, చెరుకు, సర్కస్‌లాంటి వాటి ద్వారా వచ్చే ఆదాయం దేవదాయశాఖకు అందడంలేదు. కొంత పర్సంటేజీ పైభాగానికి కేటాయించినా బాగుంటోందని భక్తులు చెబుతున్నారు. లేకపోతే పైభాగం, కింది భాగం రెండు కూడా దేవదాయశాఖ పరిధికి ఇస్తే దేవాలయం అభివృద్ధి చెందే అవకాశం ఉంటోంది. రెండు శాఖల మధ్య సమన్వయం లోపించడంతోనే అభివృద్ధి జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శాశ్వత ప్రయోజనం లేకుండా..

పెద్దగట్టు(గొల్లగట్టు)కు ప్రభుత్వాలు రూ.కోట్లు కుమ్మరిస్తున్నా శాశ్వత ప్రయోజనం లేకుండా అవుతోంది. జాతర సమయాల్లో పెద్దగట్టుకు మునిసిపాలిటీ, దేవదాయశాఖలు రెండు భాగాలుగా విభజించి వేలంపాటలు నిర్వహిస్తున్నారు. గుట్టపైన ఉన్న దేవాలయం దేవదాయశాఖకు, గుట్ట కింద ఉన్న భాగం మునిసిపాలిటీ శాఖ చూడడం ఆనవాయితీగా వస్తోంది. దేవదాయశాఖ పరిధిలో ఉన్న హుండీ లెక్కలు, తలనీలాలు, టెంకాయల వేలం పాటలు మాత్రమే దేవాలయ నిర్వహణ పరిధిలోకి వస్తున్నాయి. దేవాలయం కింది భాగంలో(గుట్ట) ఉన్న ప్రాంతంలో నిర్వహించే వేలం పాటల రూపంలో వచ్చే ఆదాయం దేవాలయానికి ఉపయోగపడడంలేదు. కేవలం మునిసిపాలిటీ వారు శానిటేషన్‌కు, ఇతర పనులకు నిధులను కేటాయిస్తున్నామని చెబుతున్నారు. వేలం పాటల ద్వారా వచ్చే ఆదాయమే కాకుండా జాతరకు ప్రత్యేక నిధులకోసం మునిసిపాలిటీ రూ.రెండు కోట్లు తగ్గకుండా ప్రతిపాదనలు పంపించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతోపాటు వేలం పాటల ద్వారా వచ్చే ఆదాయం అంటే తైబజార్, సర్కస్, కొబ్బరికాయల వేలం, చెరుకు గడల విక్రయాల పాటల ద్వారా వచ్చే ఆదాయం మునిసిపాలిటీకే చెందుతోంది. ఈ తతంగం అంతా మునిసిపాలిటీ చూస్తున్నా లెక్కలు మాత్రం బయటికి చెప్పడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొల్లగట్టు జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీ‌స్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలనుంచి భక్తులు పెద్దఎత్తున వస్తుంటారు. అయితే సౌకర్యాలు మాత్రం అరకొరగానే ఉంటున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో భక్తులు ప్రతీ జాతరలో ఇబ్బందులుపడుతున్నారు.

దుర్వినియోగం కాకుండా చూడాలి



మునిసిపాలిటీ, దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వేలంపాటలు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత లింగమంతులస్వామి జాతరకు రూ.11కోట్లు కేటాయించింది. పెద్దగట్టు పైభాగం, కింది భాగంలో నిర్వహించే వేలం పాటలు దేవాలయానికి చెందాలి. వ్యాపారులు వేలం పాటల్లో సిండికేట్ కాకుండా చూడాలి.

మద్దిశ్రీనివాస్‌యాదవ్, పెద్దగట్టు మాజీ చైర్మన్

కాంట్రాక్టర్లకు అప్పగిస్తాం



పెద్దగట్టు కింది భాగంలో నిర్వహించే వేలం పాటలు సూర్యాపేట మునిసిపాలిటీకి వస్తాయి. తైబజార్, రోడ్లు, శానిటరీని కాంట్రాక్టర్లకు అప్పగిస్తాం. కొబ్బరికాయలు, సర్కస్‌లు ఇతరవాటికి వేలం పాటలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జనవరిలో వేలంపాట నిర్వహిస్తాం. నిధులు కావాలని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. షెడ్ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వలేదు.

శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట

బీఆర్‌ఎస్ అనాలోచిత నిర్ణయంతోనే నష్టం

● త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌తో రైతులకు అన్యాయం ● బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కే.లక్ష్మణ్


లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న త్రిపుల్‌ఆర్ నిర్వాసితులు

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా చేసిన త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌తో వేలాది మంది రైతులు, పేదవర్గాలు నష్టపోయే పరిస్థితి నెలకొందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కే.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్‌కు చెందిన త్రిపుల్‌ఆర్ నిర్వాసితులు శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్‌ను కలిశారు. త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌లో నెలకొన్న తప్పిదాలను లక్ష్మణ్‌కు నిర్వాసితులు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడుతూ త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రీయంగా జరగలేదని, హెచ్‌ఎండీఏ పరిధి దాటిన తర్వాత త్రిపుల్‌ఆర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, దీంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని ఓఆర్ఆర్‌కు 40కిలోమీటర్ల దూరంలో త్రిపుల్‌ఆర్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని, అందులో ఏదో మతలబు ఉందన్నారు. కొంత మందికి మేలు చేసేందుకే త్రిపుల్‌ఆర్‌ను హైవేకు ఉత్తర భాగంలో 40 నుంచి 28 కిలోమీటర్లకు కుదించారని, ఈ కుదింపులోనే ఏదో జరిగిందన్నారు. అదే హైవేకు దక్షిణ భాగంలో ఓఆర్ఆర్ కు 40కిలోమీటర్ల దూరంలో త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ ఉందని గుర్తుచేశారు. ఉత్తర భాగంలోని త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ ప్రతిపాదన అశాస్త్రీయంగా హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండడంతో రైతులు, పేద వర్గాలు తమ విలువైన ఆస్తులను కోల్పోవాల్సి వస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అనాలోచితమైన ప్రతిపాదనతో ఈ సమస్య నెలకొందన్నారు. ఉత్తరభాగంలోని త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను గత ప్రభుత్వం కొంతమందికి మేలు చేసే విధంగా అశాస్త్రీయంగా చేసిందన్నారు. లక్ష్మణ్‌ను కలిసిన వారిలో భూనిర్వాసితులు చింతల దామోదర్‌రెడ్డి, దబ్బేటి రాములు, జాల వెంకటేశ్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, బి.ఉపేందర్‌రెడ్డి, ఏసిరెడ్డి దామోదర్‌రెడ్డి, జాల నర్సింహ, జి.గాలయ్య, వేణు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా త్రిపుల్ ఆర్ అవార్డు విచారణ : ఆర్డీవో

భువనగిరి రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): త్రిపుల్ ఆర్ అవార్డు విచారణ 28వ తేదీ యథావిధిగా కొనసాగుతుందని ఆర్డీవో కృష్ణారెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో శుక్రవారం జరగాల్సిన అవార్డు విచారణ వాయిదా పడినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఎర్రంబెల్లి, తుక్కాపురం, 30న పెంచికల్‌పహాడ్, రాయిగిరి గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి అవార్డు విచారణ సమావేశం ఉంటుందన్నారు. నిర్వాసిత రైతులు అవార్డు విచారణకు హాజరై తమ భూములకు సంబంధించి వివరాలు చెప్పాలన్నారు. తమ వద్ద ఉన్న రికార్డులతో వాటిని సరిచేసి ఏ మేరకు నష్టపరిహారం వస్తుందో వారికి వివరిస్తామన్నారు. రైతులు సమావేశాలకు వచ్చినా, రాకపోయినా షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. శుక్రవారం నిర్వహించాల్సిన తేదీని తదుపరి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు.

వ్యవసాయ రంగం తడబాటు

(5వ పేజీ తరువాయి)

..సేద్యం చేస్తున్నారు. ఏఎమ్మార్పీ కింద కూడా ఈసారి నీటి విడుదల చేయనున్నారు. హైలెవల్ కెనాల్‌తోపాటు లోలెవల్ కెనాల్‌కు 120 రోజులపాటు విడుదల చేయడానికి నీటిపారుదలశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 13 వరకు సాగు నీటిని విడుదల చేయనున్నారు. యాసంగి పంటలు పూర్తయ్యేవరకు 800క్యూసెక్కుల చొప్పున విడతల వారీగా నీటిని విడుదల చేయనున్నారు. హైలెవల్ కింద 2.20లక్షల ఎకరాలకు, లోలెవల్ కింద 80లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. అదేవిధంగా 55 డిస్ట్రిబ్యూటరీలకు నీటిని విడుదల చేయనున్నారు. అయితే డివిజన్‌ల వారీగా వారబంధీ విధానంలో 800క్యూసెక్కుల చొప్పున అధికారులు సాగునీటిని విడుదల చేయనున్నారు.

రుణమాఫీపై ఇంకా గందరగోళం

రైతుల రుణాలు రూ.2లక్షలతో పాటు ఆపై ఉన్నవి రుణాల మాఫీ ఇంకా కొలిక్కి రాలేదు. గత ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణ మాఫీ ప్రకటించినా, అది అందరికీ వర్తించలేదు. మూడు జిల్లాల్లో సుమారు 4లక్షల మంది రైతులకు రుణమాఫీకి అర్హులు ఉన్నారు. రూ.2లక్షల లోపు రుణమాఫీ జరగ్గా, ఇంకా రూ.2లక్షల నుంచి ఆపైనా రుణాల పరిస్థితి గందరగోళంగా మారింది. ఇటీవల ఉమ్మడి జిల్లాకు రూ.2లక్షలకు సంబంధించి సుమారు రూ.500కోట్లకు పైగా ప్రకటించినా రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇంకా జమ కాలేదు. ఎవరైనా రైతు దురదృష్టవశాత్తు మృతిచెందితే వారి కుటుంబాలు వీధిన పడకుండా ఉండేందుకు గత ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు మాసంలో రైతుబీమా ప్రీమియంను రెన్యువల్ చేసింది.

450మందికి పైగా రైతుల ఆత్మహత్యలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ పదకొండు ఏళ్లలో రాష్ట్రంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు జరిగాయని గణాంకాలు చెప్తున్నాయి. ఆత్మహత్య చేసుకున్న వారిలో చిన్న సన్నకారు రైతులతోపాటు కౌలు రైతులు అధికంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ 11 ఏళ్లలో 450మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు రైతు సంఘాలు వివిధ రైతు వేదికలు పేర్కొంటున్నాయి. రైతుల ఆత్మహత్యల విషయంలో ప్రభుత్వాలు మాత్రం ధ్రువీకరించే పరిస్థితి లేదు. త్రీమెన్ కమిటీలో తహసీల్దార్, ఎస్ఐ, మండల వ్యవసాయాధికారి నివేదికల ఆధారంగానే కేసులు నమోదవుతాయి. అయితే త్రీమెన్ కమిటీ మాత్రం రైతుల ఆత్మహత్యల గురించి పట్టించుకునే పరిస్థితిలేదు. వరితోపాటు పత్తి పంటలు సాగు చేయడానికి ఎకరాకు ఒక్కో రైతుకు రూ.25వేల వరకు ఖర్చవుతోంది. దున్నకం, కూలి, విత్తనాలు, ఎరువుల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5వేలు చెల్లించగా కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి మూడు దఫాలుగా రూ.2వేల చొప్పున ఆరువేల వరకు ఇస్తుంది. గత ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించక పోగా ప్రస్తుతం ప్రభుత్వం కౌలు రైతులకు కూడా ఆర్థిక సహాయం ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగానే భూమిలేని వారికి ఏటా రూ.12వేలు చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఈ నెల 28న తొలివిడతగా రూ.6వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు విధివిధానాలు వెల్లడి కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 3లక్షలమంది వరకు కౌలు రైతులు ఉన్నట్లు సమాచారం. ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలతో నష్టం వాటిల్లడంతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. పంటల బీమా లేకపోవడం, ఏదైనా నష్టం జరిగినప్పుడు కౌలు రైతులతోపాటు రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కౌలు రైతుల రక్షణకు 2011 భూ అధికృత సాగుదారుల చట్టం ఉన్నప్పటికీ ఇప్పటికీ అది అమలుకు నోచుకోవడం లేదు.

ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల తరలింపు

● భవనం అద్దె ఒప్పందం ముగియడంతో ఖాళీ చేయాలని ఒత్తిడి ● అన్నంపట్లలో మూతపడిన అగ్రికల్చర్ భవనంలోకి మార్పు


ఆర్మీకళాశాలలోని విద్యార్థినులు

బీబీనగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలను బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో మూతపడిన మేధ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో 2018లో ఏర్పాటు చేశారు. 2023 ఆగస్టు నెలలో అద్దె ఒప్పందం కాలపరిమితి ముగిసింది. తిరిగి ఒప్పందం చేసుకోలేదు. దీంతో భవనం యజమాని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుని ఆర్మీ కళాశాలను ఖాళీ చేయాలని ఒత్తిడి పెంచారు. దీంతో సంబంధిత అధికారులు ఆర్మీ కళాశాలను జిల్లా సరిహద్దులోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో అవుశాపూర్ గ్రామ శివారులో మూతపడిన ప్రిన్స్‌టన్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలోకి ఈ నెల 14న తరలించారు. ప్రస్తుతం ఇక్కడి భవనంలోనే బుద్వేల్, ఇబ్రహీంపట్నం మరో ప్రాంతానికి చెందిన మూడు గురుకుల డిగ్రీ కళాశాలలు కొనసాగిస్తున్నారు. వీటికి తోడుగా ఆర్మీ కళాశాల చేర్చారు.

అన్నంపట్ల అగ్రికల్చర్ కళాశాల భవనం కాదని..

ఆర్మీ కళాశాలను ఖాళీ చేయాలని భవనం యజమాని ఒత్తిడి పెంచడంతో ప్రత్యామ్నాయంగా మండలంలోని అన్నంపట్ల గ్రామ శివారులో మూతపడిన అగ్రికల్చర్ కళాశాల భవనంలోకి ఆర్మీ కళాశాలను తరలించాలని భావించారు. ఈ మేరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో కలెక్టర్ భవన యజమానితో నెలకు రూ.8.10లక్షల అద్దె చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో యజమాని రూ.లక్షలు వెచ్చించి భవనంలో మరమ్మతులతోపాటు వసతి సౌకర్యాలు కల్పించారు. అయితే ఇక్కడి భవనంలోకి కళాశాలను తరలించడం ఇష్టం లేని సిబ్బంది, అన్నంపట్ల అగ్రికల్చర్ ప్రతిపాదిత భవనం సౌకర్యంగా లేదని కారణం చూపుతూ గురుకుల కార్యదర్శికి లేఖ కూడా రాసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆర్మీ కళాశాల ప్రిన్సిపల్ గతంలో అవుశాపూర్‌లోని గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు కూడా నిర్వహించినట్లు తెలిసింది. పైగా హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న అవుశాపూర్ అయితే తమకు సౌకర్యంగా ఉంటుందని భావించి అక్కడికి తరలించినట్లు తెలుస్తోంది. పైగా ఇక్కడ కొనసాగుతున్న మూడు డిగ్రీ గురుకుల కళాశాలలు ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోనివి కాగా ఆర్మీ కళాశాల నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన ఆర్మీ కళాశాలను ఇదే జిల్లాలో కొనసాగించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా పక్క జిల్లాకు తరలించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తాత్కాలిక తరలింపు మాత్రమే



అద్దె భవనం కాలపరిమితి ముగియడంతో యజమాని ఖాళీ చేయాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆర్మీ కళాశాలను తాత్కాలికంగా మరో చోటకు తరలించాల్సి వచ్చింది. జిల్లాలో ఆర్మీ శిక్షణకు అవసరమైన విశాలమైన స్థలం, అనుకూలమైన భవనం అందుబాటులో లేని కారణంగా జిల్లా సరిహద్దులోని అవుశాపూర్‌కు తరలించాం. ఇక్కడి భవన సముదాయాల్లో ఇప్పటికే మూడు డిగ్రీ గురుకుల కళాశాలలు కొనసాగుతున్నాయి. దాంతో ఆర్మీ కళాశాలను ఇక్కడికి తరలించి డిగ్రీ కోర్సులతోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్ యాక్టివిటీస్ కొనసాగిస్తున్నాం. కళాశాలను పూర్తిగా ఎత్తి వేస్తున్నారన్న ప్రచారాన్ని ఖండిస్తున్నాం.

డాక్టర్ నిరూప, ప్రిన్సిపల్, ఆర్మీ కళాశాల

పేదలకు ఉచిత వైద్యమే లక్ష్యం

● ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో, రిటైర్డ్ ఐపీఎస్ రాజేంద్రకుమార్



ఎన్టీఆర్ సుజల వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్

దామరచర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో, రిటైర్డ్ ఐపీఎస్ రాజేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం పుట్టలగడ్డతండాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసిన అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి రావల్సి ఉన్నప్పటికీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో సంతాప దినాల కారణంగా ఆమె కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలను నిర్విరామంగా చేపడుతున్నామని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపి, స్థానిక నాయకులు రూపావత్ శ్రీరామ్‌నాయక్, రాంరెడ్డి, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై విశ్వాసం పెంచాలి : డీఎస్పీ



శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి, శాలిగౌరారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీసులపై విశ్వాసం పెరిగేలా పనిచేయాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలలోని పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో కర్తవ్య నిర్వహణే ముఖ్యమని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్లలోని రికార్డులను, ఫైళ్లను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. పోలీసులు ప్రజలతో మమేకమై పని చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, ఇసుక అక్రమ రవాణా కాకుండా చూడాలని, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా అరికట్టాలని అన్నారు. నార్కట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, స్టేషన్ సిబ్బంది, శాలిగౌరారంలో జరిగిన కార్యక్రమంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు, స్టేషన్‌సిబ్బంది ఉన్నారు.

'అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలి'

నార్కట్‌పల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని, పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్ సమాధానం చెప్పిందన్నారు. జమిలి ఎన్నికలు రావడం వల్ల ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వాలు వారి కాలపరిమితి ముగియక ముందే దిగిపోవాల్సి వస్తుందన్నారు. అనంతరం మాజీ ప్రధాని దివంగత మన్మోహన్‌సింగ్ మృతికి మండల కమిటీ సంతాపం తెలిపింది. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, నాయకులు చెరుకు పెద్దులు, కల్లూరి యాదగిరి, కుమ్మరి శంకర్, దండు రవి, కట్ట రామచంద్రం, భగవంతరెడ్డి, ముప్పిడి సత్యం, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న గురుస్వాములు

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవరకొండ రోడ్డు చైతన్యపురి కాలనీలో అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారిని ఆశీనులను చేసి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. గురుస్వాములు విశ్వప్రసాద్, రాము, సత్యం, గిరీష్ ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నాగలక్ష్మి, వర్షిత, సత్య, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితుల గుర్తింపు సర్వే



శివన్నగూడలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మర్రిగూడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించేందుకు మర్రిగూడ వైద్యాధికారుల బృందం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెల 18వ తేదీన నుంచి ప్రారంభమైన సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 18,134 మందిని పరీక్షించినట్లు వైద్యాధికారులు శాలిని, దీపక్ తెలిపారు. శుక్రవారం 79మంది గర్భిణులు ఉండగా 20 మందికి మూత్ర నమూనా సేకరించి జిల్లా ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు సర్వే చేసి ఎంత వరకు ఫ్లోరోసిస్ బాధితులు ఉన్నారో అని జిల్లా అధికారులు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ 30ఆవులకు గర్భకోశ పరీక్షలు, కొన్ని మేకలకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 45 గెదేలు, 15 ఆవులు, 9 గొర్రెలకు సాధారణ చికిత్స నిర్వహించడమే కాకుండా 30దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేందర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్లు ప్రసాద్, సుధాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంభవీదేవికి భక్తుల పూజలు

చిట్యాలరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం శుక్రవారం సందర్భంగా మండలంలోని నేరడ గ్రామంలో గల శ్రీమహమ్మాయి శాంభవీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రాతఃకాల పూజలను నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

12వ రోజు తిరుప్పావై ప్రబంధ పారాయణం

చిట్యాలరూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయంలో 44వ మార్గళి దనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం 12వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై ద్రవిడ ప్రబంధ 12వ పాశురాన్ని పారాయణం చేసి మంగళనీరాజనాలు సమర్పించారు. 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల పూజల సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుప్పావై 12వ పాశురాన్ని పారాయణం చేసి పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలనందించి ఆశీర్వచనాలు అందజేశారు.

ఫాదర్ జోసఫ్ రోమనో సేవలు అభినందనీయం



ఫాదర్ జోసఫ్ రోమనో విగ్రహం ఎదుట ప్రార్థనలు నిర్వహిస్తున్న బిషప్ ధమన్‌కుమార్, మత గురువులు తానయ్య, బాలశౌరి

కేతేపల్లి, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): ఫాదర్ జోసఫ్ రోమనో చేసిన సేవలు అభినందనీయమని నల్లగొండ జిల్లా క్రైస్తవ మేత్రాసన పీఠాధిపతి ధమన్‌కుమార్ కొనియాడారు. ఇటలీలో పుట్టి పెరిగిన క్రైస్తవ మతగురువు జోసఫ్ రోమనో సేవాభావంతో 1957లో ఇండియాలో అడుగుపెట్టాడు. తొలుత కేతేపల్లి మండల కేంద్రంలోని జపమాలమాత చర్చి నిర్వహణ బాధ్యతలు చేపట్టి దాదాపు 27ఏళ్ల పాటు ఇక్కడ క్రీస్తు సేవలో తరించారు. ఆ తర్వాత ఇదే మండలంలోని రాయపురం పునీత రాయప్ప చర్చి పాదర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన 28 ఏళ్లు అక్కడే కొనసాగుతూ మృతి చెందారు. స్థానికంగా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా స్థానిక చర్చి విచారణ గురువు బాలశౌరి, పలువురు మతగురువులు, వివిధ క్రైస్తవ సంస్థలు, చర్చి పెద్దల సహకారంతో రాయపురంలో ఫాదర్ జోసఫ్ రోమనో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన శత జయంతి ఉత్సవం సందర్భంగా నల్లగొండ బిషప్ ధమన్‌కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. జీవితమంతా పేదలు, బడుగు, బలహీనవర్గాల సేవకు అంకితం చేసిన మహనీయుడు రోమనో అని కొనియాడారు. జోసఫ్ రోమనో జీవితాన్ని నేటి యువ మతగురువులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జోసఫ్ రోమనో విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక చర్చి విచారణ గురువు టి.బాలశౌరి, వివిధ ప్రాంతాల మతగురువులు పి.అలెగ్జాండర్, ఎం.బాలశౌరి, ఎం.తానయ్య, బంద బాలస్వామి, బొజ్జలూర్దు, మాదాను సబ్‌స్టేన్, రాజు, పనల ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

నాంపల్లికి మహర్దశ

● రూ.24 కోట్ల నిధులు మంజూరు ● మారనున్న మండల రూపు రేఖలు
● ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు



నాంపల్లి మండల కేంద్రం

నాంపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నాంపల్లి పట్టణానికి మహర్దశ పట్టనుంది. పట్టణ రూపురేఖలు మార్చడానికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. నాంపల్లి పట్టణంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3784 మంది జనాభా ఉండగా ప్రస్తుతం 4500 నుంచి 6 వేల వరకు పెరిగింది. ప్రస్తుతం ఓటర్లు 3346 మంది ఉన్నారు. పేరుకు మండల కేంద్రమైన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చే వారికి నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైంది. ప్రస్తుతం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో నుంచి నాంపల్లి పట్టణ అభివృద్ధి కోసం రూ. 24కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో మండల కేంద్రాన్ని అన్ని హంగులతో పాటు మౌలిక వసతులు కల్పించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గుర్రంపోడు రోడ్డు నుంచి మర్రిగూడ రోడ్డు వరకు 2.6 కిలోమీటర్ల నాలుగు వరుసల రోడ్లను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక ఈ రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేసి పుట్‌పాత్, హైమాస్ట్ లైట్లను, డ్రైనేజీ, జంక్షన్లను ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రస్తుతం నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం టెండర్ దశలో ఉంది. పనులు పూర్తయితే పట్టణంలో మౌలిక సదుపాయాలు ఏర్పడి పట్టణం అభివృద్ధి చెందుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో నాంపల్లి అభివృద్ధి



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో నాంపల్లి పట్టణ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు అవుతాయి. పేరుకు మండలమైనా మౌలిక వసతుల విషయంలో వెనుకబడి ఉన్నాం. నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఈ నిధులతో పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది.

● పూలే వెంకటయ్య, మాజీ ఎంపీపీ

టెండర్ దశలో రోడ్డు నిర్మాణ పనులు

పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 24 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం నాలుగు వరసల రోడ్డు పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు టెండర్ పనులు పూర్తయితే పనులు చేపడతాం.

● వికాస్, ఆర్‌అండ్‌బీ ఏఈ

నీలాయిగూడెంలో జూదరుల అరెస్ట్

● రూ. 20,560 నగదు పట్టివేత

త్రిపురారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. నీలాయిగూడెంలో బోగాది రామిరెడ్డి కొట్టం వద్ద శుక్రవారం కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు.

గ్రామానికి చెందిన గున్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, అంజనపల్లికి చెందిన గ్యార రవి, బెజ్జికల్‌కు చెందిన కంచర్ల నరసింహచారి, సత్యనారాయణపురానికి చెందిన వేగుల శ్రీనివాసరావులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20,560 నగదు, రెండు మోటారు సైకిళ్లు, 104 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్



గట్టుప్పల్‌లో మన్మోహన్ సింగ్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్నాథం, నాయకులు

కట్టంగూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియడారు. పలువరు ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అని అన్నారు. కట్టంగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు మన్మోహన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి సాగర్, పట్టణాధ్యక్షుడు చెరుకు యాదగిరి పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి: స్థానిక బస్టాండ్ వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య వడ్డే భూపాల్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెర్రిపోతుల భరత్, ఇడుకుళ్ల బిక్షమయ్య, ఎస్‌కే సమద్, ప్రజ్ఞాపురం సత్తి, సల్లా వాసుదేవ్, దోసపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం: మండలకేంద్రంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కిమటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గూని వెంకటయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ సీఎం రెడ్డి, మండలాధ్యక్షుడు బొల్లికొండ గణేష్, నాయకులు బండపల్లి కొమరయ్య, చింత ధనుంజయ్, వేముల గోపినాథ్, బొడ్డు నగేష్, సోమయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్: మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నామ జగన్నాథం, ఉపాధ్యక్షుడు రావుల రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● చిట్యాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాస్, పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, ఎద్దులపూరి కృష్ణ, ఏర్పుల పరమేశం, ఆంజనేయులు, వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్: చండూరు మండలంలో పలు గ్రామాల్లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పోలగోని స్వామి, సుర్కంటి పత్తిరెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి, అంతటి పారిజాతనర్సింహగౌడ్, మరగోని యాదయ్య, గోలి గణేష్ పాల్గొన్నారు.

● కనగల్ : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం సంతాపం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో హాపీజుద్దీన్ సింగం పెద్దులు, పందుల రాజు, వెంకన్న, రాయల శ్రవణ్, జానయ్య, చిలకరాజు వెంకన్న, కూసుకుంట్ల రాజారెడ్డి ఉన్నారు.

● మర్రిగూడ: మండలకేంద్రంలోని చౌరస్తా వద్ద డా.మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులలర్పించారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ మాజీ సర్పంచులు బిచ్యానాయక్, శ్రీనివాస్‌నాయక్, రఘు, శ్రీనివాస్, బేత యాదగి పాల్గొన్నారు.

● కేతేపల్లి: మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, పరశురాములు, ఎన్.మంగమ్మ, నాయకులు కోట పుల్లయ్య, ఎ.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నాంపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, నేతాళ్ల కొండల్‌యాదవ్, పానగంటి వెంకటయ్య గౌడ్, నాంపల్లి హనుమంతు, ఎదుళ్ల రాములు, ఈద శేఖర్ పాల్గొన్నారు.

● చండూరు: చండూరులో మన్మోహన్ చిత్రపటానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, అనంత చంద్ర శేఖర్‌గౌడ్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, మాజీ సర్పంచులు యనల్లగంటి మల్లేశం, పన్నాల లింగయ్య, మేకల సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మర్రిగూడ: సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

కేతేపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆదిమళ్ళ సుధీర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయితీ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయితీ కార్మికులు మండల కేంద్రం కేతేపల్లిలో రెండు రోజుల సమ్మెను ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఆందోళన చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏడాకుల కోటయ్య సైదులు, వెంకటేష్, పి.వెంకటాచారి, శోభ, రమణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అరూరి శ్రీను, మహంకాళి బాలమ్మ, వలిగొండ లింగయ్య, సిర్పంగి యాదయ్య, నందిపాటి గణేష్, మేడి వసంత, మహంకాళి సత్తమ్మ, గుర్రం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కానుగు లింగస్వామి, కార్మికులు కొప్పోలు శంకర్, మహేశ్వరం రాములు, మంజుల, దుబ్బ రవి, కాశయ్య, యాదయ్య, రామృష్ణ, రాములు, సురేష్, భిక్షం ఉన్నారు.

మర్రిగూడ: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. పారిశుధ్య కార్మికుల గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల నాయకులు సలవోజు రామలింగాచారి, ఉరిపక్క లింగయ్య, నలవెల్లి యాదయ్య, మహేష్, ముత్తమ్మ, సుజాత, అంజమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, పల్లెటి హరికృష్ణ, గాదెపాక మరియమ్మ, నాగిళ్ల ఎల్లయ్య, అబ్బనబోయిన వెంకటయ్య, గంటపాక రవి, కొమ్ము గణేష్, తుమ్మలపల్లి జైపాల్ రెడ్డి, ఎదుళ్ల వెంకటయ్య, గుండు అరుణ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ప్రతీ గ్రామానికి బస్సుసౌకర్యం కల్పించాలి

● జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

నల్లగొండరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బస్సుల సంఖ్య పెంచి, ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ బస్టాండ్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సును కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అదే విధంగా జిల్లా అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మునుగోడు ప్రాంతంలో బస్సు సౌకర్యం లేక సుమారు 500 నుంచి 800 మందికి పైగా విద్యార్థులు చదువుకోవడానికి జిల్లా కేంద్రానికి రావడానికి అవస్థలు పడుతున్నారని అన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండా అనురాధ, జిట్ట సరోజ ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి భూతం అరుణకుమారి పాల్గొన్నారు.



బస్టాండ్‌లో సంతకాల సేకరణ చేపడుతున్న ఐద్వా నాయకులు

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

రామగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ సాధారణ స్థాయి సమావేశం శనివారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థి పవన్ మృతి తీరని లోటు

శాలిగౌరారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనిమద్దె గ్రామానికి చెందిన జనగం పవన్ వల్లాల మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. పవన్ డెంగ్యూ వ్యాధితో గురువారం మృతి చెందాడు. శుక్రవారం వల్లాల మోడల్ ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, కుక్కడపు శ్రీనివాసులు, మనిమద్దె గ్రా మంలో పవన్ మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. పవన్ అకాలమృతి తీరనిలోటని వారు పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ ముందంజ



గుండ్రాంపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న సత్యం

చిట్యాలరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూ సీపీఐ ప్రజల మన్ననలను పొంది వారి హృదయాల్లో ఆ పార్టీ జిల్లా నాయకుడు జిల్లా యాదయ్య అన్నారు. సీపీఐ శత వ సంత దినోత్సవం సందర్భంగా మండలంలోని గుండ్రాంపల్లిలో ఆపార్టీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సీట్లు, ఓట్లతో సంబంధం లేకుండా ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు విలువలతో కూడిన రాజకీయాలు చేయడం ఎంతో గర్వించదగిన విషయమన్నారు. పార్టీ వందేళ్ల పండుగ సందర్భంగా ఈ నెల 30వ తేదీన నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల ఆవరణలో జరిగే బహిరంగ సభ ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్యక్రమంలో జిల్లా సత్యం, కేతరాజు అంజయ్య, బొడిగె బక్కశెట్టి, బొబ్బల శంకర్‌రెడ్డి, దుబ్బ విఘ్నేశ్వర్, సీమ అంజయ్య, లింగస్వామి, శివ, శంకర్, వెంకటేశం, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత

మిత్రురాలి కుటుంబానికి రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్

శాలిగౌరారం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామానికి చెందిన మాదాసు నర్సింహ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి భార్య సరితతో కలిసి చదువుకున్న 2005-06 ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు వారి పిల్లల పేరు మీద రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందజేశారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న సరితను తోటి స్నేహితులు ఆదుకొని అండగా నిలవడంపై గ్రామస్థులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కుటుంబానికి సహాయం చేసిన మిత్రులను పలువురు అభినందించారు.

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

చిట్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిట్యాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారుడు నాగుర్‌వలీ పశ్చిమబెంగాల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యాడు. ఆయనకు ఖర్చుల కోసం ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిన రూ.5వేల రూపాయలను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. అలాగే చిట్యాలకు చెందిన కొసనం యాదగిరి అనారోగ్యంతో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే పంపిన రూ. 10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, మారగోని అంజనేయులు, ఏర్పుల పరమేశం, ఎద్దులపురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

(5వపేజీ తరువాయి)

రాష్ట్రస్థాయి మహాసభల్లో విద్యారంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై చర్చించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, వాటి ద్వారానే నాణ్యమైన విద్యనందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మహాసభల్లో చర్చించి, తీర్మానిస్తారు. అదే విధంగా ఉపాధ్యాయుల సంక్షేమం, పెండింగ్ డీఏలు ఇతర సమస్యలపైనా చర్చించి ప్రభుత్వానికి సూచనలందజేసేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూటీఎఫ్ సమరశీల పోరాటాలతోనే రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దుకు నిర్ణయం తీసుకోవాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈ మహాసభల్లో మార్గనిర్దేశం చేస్తామని, రానున్న రెండేళ్లకు కార్యాచరణ కూడా రూపొందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



నల్లగొండ క్లాక్‌టవర్ కూడలిలో ఏర్పాటు చేసిన యూటీఎఫ్ జెండాలు



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 19.4



వ్యవసాయ రంగం తడబాటు

మననం 2024

గత ఏడాది వానాకాలంలో పత్తిపంట రైతులను దెబ్బతీయగా, ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 9.27లక్ష ఎకరాల్లో పత్తి సాగైంది. అయితే ఎకరానికి 12క్వింటాళ్లకు బదులు కేవలం 6నుంచి 8క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చింది.ఒక్క నల్లగొండ జిల్లాలోనే 149191.39 మెట్రిక్ టన్నులను సీసీఐ కొనుగోలు చేసింది. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పత్తి, వరి అధికంగా సాగైంది. ఉమ్మడి జిల్లాలో 85లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేయగా, సు మారు 70లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టింది. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 10వేల ఎకరాలల్లో ఆయిల్‌పామ్ సాగు కాగా, సూర్యాపేట జిల్లాలో సుమారు 6వేల ఎకరాల్లో సాగైంది. రానున్న రోజుల్లో మరింతగా పంటలను విస్తరించి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. 65వ జాతీయ రహదారిపై నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మధ్య 200 ఎకరాల్లో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయాలని చూస్తోంది. ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్‌ను అమలులోకి తెచ్చింది.

యాసంగిపై బోలెడు ఆశలు

యాసంగి సీజన్‌పై రైతులు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మెట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు అతంత మాత్రంగా ఉండటం, విద్యుత్ అనధికార కోతలతో ఇబ్బందులు తప్పేలా లేవు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 23,74,280 ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. నల్లగొండ జిల్లాలో 11.50లక్షల ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 6,24,280 ఎకరాలు, యాదాద్రి జిల్లాలో 6లక్షల ఎకరాలు ఉంది. యాసంగిలో కేవలం వరి పంట సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. నల్లగొండ జిల్లాలో సాగర్ ఆయకట్టుకు ఈ సీజన్‌లో కూడా నీటి విడుదల జరగనుండటంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. మెట్ట ప్రాంతాల్లో బోరు బావుల కింద రైతులు వరి సాగు చేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో 2.31లక్షల ఎకరాలు బోరు బావుల కింద సాగవుతుండగా, 1.23 లక్షల్లో వర్షాధారంగానే పంటలు సాగవుతున్నాయి. భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి ప్రాంతాల్లో కొన్ని గ్రామాల్లో మూసీ నీటి ఆధారంగా రైతులు వరి...

- మిగతా 7వ పేజీలో...



ప్రకృతి మిగిల్చిన విషాదం

» తల్లడిల్లిన రైతులు » భారీ వర్షాలతో పంట నష్టం

ప్రకృతి ఈ ఏడాది మిగిల్చిన విషాదంతో రైతులు తల్లడిల్లారు. సెప్టెంబరు 1న ఎన్నడూ లేని విధంగా 30 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. దీంతో సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది. పంటపొలాలు వరదలో కొట్టుకుపోయాయి. వాగులు, వంకలకు గండ్లు పడి, చెరువు కట్టలు తెగిపోయాయి.

6 - (ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్)





'రైతు భరోసా'పై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేయగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 12.40లక్షల మందికి పెట్టుబడి సాయం అందింది. ప్రతీ సీజన్‌లో రూ.1600కోట్లకు పైగా అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గత ఏడాది ఎన్నికల కోడ్‌తో ఈ ప్రక్రియ నిలిచిపోగా, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 12 నుంచి జమచేయాలన్న ఆదేశాలతో అనేక ఆటంకాల నడు మ ఆ ఏడాది యాసంగికి సంబంధించిన పెట్టుబడి సాయం అరకొరగా అందింది. ఖజనాలో నగదు కొరత కారణంగా ఈ పథకం ముందుకు సాగలేదు. పార్లమెంటు ఎన్నికల ముందు రైతుల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏకకాలంలో రైతుబంధును విడుదల చేసింది. రైతు భరోసాపై మాత్రం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5వేలు రైతుబంధు ఇస్తే కాంగ్రెస్ ఎకరాకు రూ.7500 చెల్లిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా దీనిపై స్పష్టత లేదు. సంక్రాంతి పండుగ, లేదంటే ఆ తరువాత రైతు భరోసా ఇస్తామని, ప్రభుత్వం చెబుతున్నా, ఎన్ని ఎకరాలకు చెల్లిస్తుందనే దానిపై మార్గదర్శకాలు విడుదల చేయలేదు.

» గత ఏడాది కంటే మెరుగైన పంటల సాగు
» పెరిగిన ధాన్యం దిగుబడి » తగ్గిన పత్తి దిగుబడులు
» కొలిక్కిరాని రైతుభరోసా పథకం, రైతుల ఎదురుచూపు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయరంగం ఈ ఏడాది పలు ఆటుపోట్లను ఎదుర్కొంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆలస్యంగా వర్షాలు కురవడం, నాగార్జునసాగర్ సైతం ఆలస్యంగా వరద రావడంతో ఆయకట్టులో వరి సాగు ఆలస్యమైంది. ఖరీఫ్ ధాన్యం దిగుమతి పెరిగినా కొనుగోళ్ల సమయంలో సన్నాల రైతులు తొలుత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పత్తి దిగుబడి తగ్గింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ కావడం రైతులను కొంత ఊరటకు గురిచేసినా రైతు భరోసా పథకంపై ఎలాంటి ప్రణాళికలు రూపొందించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుల్లో కదలిక

నల్లగొండ జిల్లాలో శ్రీశైలం సొరంగమార్గంతో పాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుల్లో కదలిక మొదలైంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు టయల్‌రన్ ప్రారంభించడంతో పాటు కాల్వ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. మరో 10 శాతం పనులు మాత్రమే బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టులో మిగిలాయి. ఈ ప్రాజెక్టు కింద నకిరేకల్ నియోజకవర్గంలో 60వేల ఎకరాలకు, నల్లగొండ నియోజకవర్గంలో 25వేల ఎకరాలకు, మునుగోడు మండలానికి 10వేల ఎకరాలు, 5వేల ఎకరాల వరకు తుంగుతుర్తి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందనుంది. ఇక ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4500కోట్ల ను వెచ్చించాలని నిర్ణయించింది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా టన్నెల్ బోర్ మిషన్ బేరింగ్‌ను పరిశీలించడంతో పాటు దానిని తెప్పించడానికి కృషి చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి సొరంగ మార్గం పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ఆయకట్టుకు అమృత ధార

ఏడాది తొలినాళ్లలో బీడువారిన భూములు

కృష్ణమ్మ గలగలతో పసిడి సిరులు

దక్షిణ భారత జీవనాడి కృష్ణమ్మ రైతన్నల మోములో ఆనందాన్ని పారించింది. పంటలకు సెలవిచ్చిన భూములు ముళ్ల కంపలకు నెలవు కాగా, సుమారు రెండేళ్ల అనంతరం నిండుగా కురిసిన వానలతో నాగార్జునసాగరం నిండి పంటకాల్వలు పారాయి. దీంతో ఆయకట్టులో సిరుల పంటలు పండాయి. నల్లగొండ జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదలై రాష్ట్రానికే సాగర్ ఆయకట్టు పచ్చల హారంలా మారి రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చింది.

6 - (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)



నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



మహాసభల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఇతర యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): టీఎస్ యూటీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక మహాసభలకు రంగం సిద్ధమైంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో ఏర్పాటుచేసిన ప్రాంగణంలో 28,29,30 తేదీల్లో మూడు రోజులపాటు ఈమహాసభలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్‌సభ్యులు, నాయకులు ఈసభల్లో పాల్గొనేందుకు ఇప్పటికే నల్లగొండకు చేరుకున్నారు.

మహాసభల సందర్భంగా నల్లగొండ పట్టణంలో యూటీఎఫ్ పతాకాలు, తోరణాలు కట్టారు. ఆహ్వానసంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు ఈ సభల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. సభల తొలి రోజు ఉదయం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులతో నల్లగొండలో మహాప్రదర్శన నిర్వహించనున్నారు. 11 గంటలకు ప్రారంభమయ్యే సభకు ముఖ్యఅతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నారు. అంతేగాక సభలో ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ.నరసింహారెడ్డి కూడా ప్రారంభ సభ కు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి మొదలయ్యే విద్యాసదస్సులో మాజీ ఎమ్మెల్సీ ప్రొ ఫెసర్ నాగేశ్వర్ 'భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలు' అనే అంశంపై ప్రసంగిస్తారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి' పూర్వ ఎడిటర్ డాక్టర్ కె.శ్రీనివాస్ 'విద్యలో రాజ్యాంగ విలువలు' అనే అంశంపై, ఎస్ఎఫ్ఐ జాతీయ సంయుక్త కార్యదర్శి అయిషీ ఘోష్ 'జాతీయ విద్యావిధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడరున్నారు. సాయంత్రం 6గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలకు సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ హాజరుకానున్నారు. రెండో రోజు 29న ఉదయం మహాసభల్లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య ప్రసంగించనున్నారు. ప్రతినిధుల సభలో పలు కమిటీల నివేదికలను సమర్పిస్తారు. 30న జరిగే ప్రతినిధుల సభలో నివేదికలపై చర్చతో పాటు జిల్లాల నివేదికలు, తీర్మానాలు, కర్తవ్యాలపై చర్చిస్తారు. అదే రోజు మధ్యాహ్నం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకొని సాయంత్రానికి మహాసభలను ముగిస్తారు.

విద్యారంగ సమస్యలపై చర్చ

నల్లగొండలో మూడురోజుల పాటు జరిగే...

- మిగతా 8వ పేజీలో...

మన్మోహన్ గొప్ప దార్శనికవేత్త

డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల

మిర్యాలగూడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ గొప్ప దార్శనికవేత్త, సంస్కరణల పితామహుడని, ఆయన అస్తమయం దేశానికి తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎలాంటి అవినీతి, మచ్చలేని నిజమైన ప్రజానాయకుడు అని కొనియాడారు. సంకీర్ణ ప్రభుత్వంలో మాటల కంటే మౌనంగా స్థిరమైన వృద్ధిరేటుకు, దేశ ఆర్థిక సంస్కరణలకు రూపకల్పన చేసిన గొప్ప దార్శనికవేత్తగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రధాని పీవీ.నర్సింహారావు కాలంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించి సంస్కరణల్లో కీలక భూమిక పోషించారని అన్నారు. రాజకీయాల కంటే రాజనీతిజ్ఞునిగా ప్రధాని పదవికి వన్నెతెచ్చారని కొనియాడారు. నిరాడంబరత,నిగర్వి, కాంగ్రెస్ ప్రధానుల్లో నెహ్రూ అనంతరం 10ఏళ్ల ప్రధానిగా మన్మోహన్ కొనసాగారన్నారు. ఆయన కాలంలోనే ఉపాధి హామీ చట్టం తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు బలహీన వర్గాల వారికి ఉపాధి ద్వారా ఆర్థిక చేయూత అందించారని అన్నారు. ఆయన అస్తమయం దేశానికి, కాంగ్రెస్ పార్టీకీ తీరని లోటని అన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, మహబూబ్ అలీ, నూకల వేణుగోపాల్‌రెడ్డి, స్కైలాబ్ నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, తక్కెళ్లపల్లి సైదులు, కొమ్ము శ్రీనివాస్, గంధం రామకృష్ణ, వెంకటేశ్వర్లు గౌడ్, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన వాయిదా

నల్లగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించాల్సిన జిల్లా స్థాయి సైన్స్ మేళాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఈవో బొల్లారం భిక్షపతి, సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి సందర్భంగా వారం రోజుల పాటు సంతాప దినాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సైన్స్ మేళాను తాత్కాలికంగా వాయిదా వేశామని, త్వరలో తదుపరి తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు వాయిదా

నల్లగొండ పట్టణంలో శనివారం నిర్వహించనున్న కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సైతం వాయిదా వేస్తున్నట్టు పార్టీ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా కార్యక్రమాన్ని వాయిదా వేశామని, పార్టీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయంతోనే నష్టం

బీజేపీ నేత లక్ష్మణ్ 7

ఆవు పాలకు గేదె పాల బిల్లు

» మదర్ డెయిరీ అక్రమాలపై కొనసాగుతున్న విచారణ
» ఇప్పటికే ఆరుగురిపై సస్పెన్షన్ వేటు
» ప్రతీ నెల రూ.2 లక్షలు కాజేసినట్టు ఆరోపణలు

6



ప్రమాదానికి కొద్ది గంటల ముందు తీయించుకున్న ఫొటోలో పావని (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడి మృతి

- భర్త, కుమార్తెకు గాయాలు
- దైవ దర్శనం చేసుకుని వెళ్తుండగా విషాదం

శుక్రవారం పాఠశాలలకు సెలవు కావడంతో భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు బైక్‌పై దైవ దర్శనానికి వచ్చారు. ఆనందంగా గడిపి తిరిగివెళ్తున్న క్రమంలో ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. శుక్రవారం రాయిగిరి శివారులో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో రంగారెడ్డి జిల్లా చెంపాపేటకు చెందిన బహిగల్ల పావని(30), ఆమె కుమారుడు కన్నయ్య(3) మృతిచెందగా, భర్త బహిగల్ల జగన్, కుమార్తె సాత్విక గాయపడ్డారు.

6

ఆఫ్‌లైన్‌లో ఇసుక దందా

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పగలంతా డంపింగ్
- రాత్రి వేళల్లో తరలింపు
- పంచాయతీ ఆదాయానికి గండి
- సామాన్యులకు ఇసుక దొరకని దుస్థితి



రావులపెంట గ్రామంలో ఇళ్లల్లో నిల్వ చేసిన ఇసుక డంపింగ్‌లు



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

వేములపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వేములపల్లి మండలంలోని రావులపెంట, ఆమనగల్లు, కామేపల్లి, లక్ష్మీదేవిగూడెం గ్రామ సరిహద్దుల గుండా ప్రవహిస్తున్న పాలేరు, మూసీ వాగు ఇసుక అక్రమ రవాణాదారులకు ఆదాయమార్గంగా మారింది. ఈ రెండు వాగులు మిర్యాలగూడ పట్టణంతో పాటు సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండటంతో ఇసుకకు భారీగా డిమాండ్ ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు ఆన్‌లైన్ విధానంలో గిట్టుబాటు కావడం లేదని ఆఫ్‌లైన్ విధానంలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. దీంతో గ్రామపంచాయతీలకు అందాల్సిన ఆదాయం అందకుండా పోతుంది. సమీప గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు తమ గృహ నిర్మాణాల కోసం ఇసుక రవాణాకు నానాఅగచాట్లు పడాల్సి వస్తుంది. కానీ రోజు పదుల సంఖ్యలో ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నా మైనింగ్, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు సమన్వయ లోపంతో తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఈ అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసేవారు లేకుండాపోయారు. ఇదే అదనుగా భావించిన ఇసుక దళారులు యథేచ్ఛగా రాత్రి, పగలు అన్న తేడాను లేకుండా ఇసుకను జోరుగా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రధానంగా మండలంలోని రావులపెంట, కామేపల్లి, ఆమనగల్లు కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఆమనగల్లు నుంచి ఒక కిలోమీటర్ దూరంలో సూర్యాపేట జిల్లా సరిహద్దు ఉండటంతో పోలీసులు సమాచారం అందినా అక్కడికి వెళ్లేలోపు సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశించడంతో వారిని ఏమి చేసే పరిస్థితి లేకుండా పోతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇక్కడ ఏ విధమైన చెక్‌పోస్టు లేకపోవడం అక్రమదారులకు అనుకూలంగా మారింది. మరోవైపు కామేపల్లి వేములపల్లి మండల కేంద్రానికి సుదూరంలో ఉండటంతో పాటు పక్కనే మిర్యాలగూడ మండల సరిహద్దు కావడంతో అక్కడ సైతం ఇసుక అక్రమ రవాణాదారులకు అదునుగా మారింది. దీంతో జోరుగా ఇసుక రవాణా సాగుతుంది. అయినా సంబంధిత అధికారులు ఇక్కడ ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడం ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది.

ఆన్‌లైన్‌లో నిల్ - ఆఫ్‌లైన్‌లో ఫుల్

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేసేందుకు 2019లో మండలంలోని రావులపెంట గ్రామపంచాయతీలో ప్రభుత్వ రీచ్‌ను ఏర్పాటు చేసి ఆన్‌లైన విధానంలో ఇసుక రవాణాకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2019 ఫిబ్రవరిలో రీచ్‌ను ఏర్పాటు చేసి మైనింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి ఇసుక రవాణాకు శ్రీకారం చుట్టారు. తద్వారా ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.100 చొప్పున రావులపెంట గ్రామానికి 2019లో రూ.15 లక్షలు, 2020లో రూ.11 లక్షలు, 2021లో రూ.11 లక్షల మేర ఆదాయం సైతం సమకూరింది. కానీ ఆన్‌లైన్ విధానంలో ఇసుక సరఫరా చేయడంతో తమకు గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు ఆన్‌లైన్ విధానానికి స్వస్తి పలుకుతూ వచ్చారు. ఆఫ్‌లైన్‌లోనే ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు. దీంతో రెండు సంవత్సరాలుగా ఆన్‌లైన్‌లో సరైన ఇసుక రవాణాల లేక గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడటంతో గ్రామాభివృద్ధి కొంతమేర కుంటుపడిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయినా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంలో అంటిముట్టనట్లుగా వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తుంది.

పగలంతా డంపింగ్

మండలంలోని పాలేరు, మూసీ వాగుల సమీప గ్రామాలైన రావులపెంట, కామేపల్లి, ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లోని ఇసుక దళారులు పగటి వేళల్లో యథేచ్ఛగా ఇసుకను తరలించి తమ ఇంటి, దొడ్ల వద్ద భారీగా డంపింగ్ చేస్తున్నారు. ఒక్కొక్క ఇంటి వద్ద ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్నా వాటిని నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వాగుల్లో ప్రతి నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న విషయాన్ని ఎవరైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాక ఆ సమాచారాన్ని ఇసుక అక్రమ రవాణాదారులకు తెలియచేయడంతో సమాచారం ఇచ్చిన వారిపై భౌతిక దాడులు పాల్పడుతున్నారు. అయినా గ్రామాల్లో వెలుస్తున్న అక్రమ డంపింగ్‌లను సీజ్ చేయడంలో మాత్రం రెవెన్యూ, పోలీసు అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే వాల్టా కేసు



మండలంలోని పాలేరు, మూసీ వాగుల నుంచి ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమ రవాణా జరగకుండా చూస్తున్నాం. వాగుల సమీపంలో ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహించి ఇసుక రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తాం.

● డి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ, వేములపల్లి

ఫటాఫట్

నేరాల అదుపునకు సీసీ కెమెరాల ఏర్పాటు

గోపాల్‌రావు, ఎస్‌ఐ, నిడమనూరు



మండలంలో శాంతిభద్రతలు పదిలంగా ఉన్నాయని ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు. నేరాలు అదుపు చేసేందుకు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. దొంగతనాల నివారణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

- (నిడమనూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయి?

ఎస్‌ఐ: మండలంలో శాంతిభద్రతలు పదిలంగా ఉన్నాయి. ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. నేరాల అదుపునకు పోలీసులకు ప్రజలు సహకరించాలి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌ఐ: దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళల్లో పోలీసు సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రజలు గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆంధ్రజ్యోతి: ట్రాఫిక్ సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు?

ఎస్‌ఐ: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా రోడ్లపై వాహనాలు నిలిపితే హెచ్చరించడమే కాకుండా కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రైవేటు వాహనాల తనిఖీల గురించి?

ఎస్‌ఐ: వాహనాల తనిఖీలు నిత్యం నిర్వహిస్తున్నాం. అవసరమైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పరిమితికి మించి ప్రయాణీకులతో ఆటోలు తిరుగుతున్నాయి?

ఎస్‌ఐ: నిబంధనలపై, ఆటోవాలాలకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిమితికి మించి జనాలను ఎక్కించుకోవడంతో పాటు అతివేగంగా ఆటోలు నడిపితే చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల మేరకు ఆటోలను నడపాలని వారికి సూచిస్తున్నాం.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు



వేములపల్లిలో మనోహ్మన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకొండ, హాలియా, దామరచర్ల, వేములపల్లి, చింతపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి, దేశ ఆర్థిక సంస్కరణ రూపకర్త డాక్టర్ మనోహ్మన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మనోహ్మన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనోహ్మన్‌సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని, ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడే, దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. సమాచార హక్కు, ఉపాధిహామీ, విద్యాహక్కు చట్టం అమలులోకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

హాలియాలో ప్రధాన సెంటర్‌లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, వైస్ చైర్మన్ గౌరవ సలహాదారుడు పిల్లి ఆంజనేయులు, నాయకులు తక్కెళ్లపల్లి సైదులు, అన్నెపాక శ్రీనివాస్, జూపల్లి శ్రీనివాస్, నెర్మటి వెంకట్‌రెడ్డి, పాండునాయక్, మజహర్ మొయినుద్దీన్, గౌస్, కృష్ణ, సైదులు, శ్రీనివాస్, సుధాకర్, రంజిత్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, చందునాయక్, శేఖర్ పాల్గొన్నారు.

దామరచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు పగిడి జీడయ్యయాదవ్, కొమ్ము దాసు, ఆకారం గోపాల్, వసంత్, శివకుమార్, చెన్నయ్య కాసాని వెంకటేశ్వర్లు, రాజు, సైదులు, మంతనాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

వేములపల్లి మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి మన్మోహన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన కృపాకుల గంగమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.19 వేల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు పుట్టల వెంకటేశ్వర్లు, గంజి శ్రీనివాస్, బొంగర్ల వినోద్, ఏలె నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, గిరి, వెంకన్న, సుధాకర్, శ్రీనివాస్, ఫని, మునీర్, సోహెల్, నవీద్ పాల్గొన్నారు.

చింతపల్లి మండంలోని వెంకటేశ్వరనగర్‌లో మన్మోహన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, నాయకులు అంగిరేకుల గోవర్ధన్, పూరె లక్ష్మణ్, మాస భాస్కర్, ఎండి.ఖలీల్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.



దామరచర్లలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నియామక పత్రాలు అందజేస్తున్న రాములు

బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలి

చింతపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా కార్యదర్శి చెనమోని రాములు అన్నారు. చింతపల్లి మండలంలోని వెంకటంపేట(తీదేడు)లో శుక్రవారం 47, 48 బూత్ అధ్యక్షులుగా బొడ్డు గణేష్, శివర్ల ప్రవీణ్‌ను కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లోకి తీసుకెళ్లేందుకు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, సీనియర్ నాయకులు ధరణిపతి రమణారావు, గజ్జ అభినవ్‌గౌడ్, ఐతగోని శివ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి శశిధర్‌రెడ్డి

వేములపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రైతు భరోసాను తక్షణమే అమలు చేసి రైతుల ఖాతాల్లో నగదును జమ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా వానాకాలానికి సంబంధించి రైతు భరోసా నిధులు విడుదల చేయకపోగా యాసంగికి కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నందున ప్రభుత్వం ప్రకటించిన విధంగానే ఎకరాకు రూ.7,500 తక్షణమే ఒకే విడతలో రెండు సీజన్‌లకు సంబంధించి రూ.15వేలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రొండి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు పతాని శ్రీను, ఐతగాని విష్ణు, పుట్ట సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి



చందునాయక్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల నేతలు

దేవరకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర చందునాయక్ అన్నారు. దేవరకొండలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన చందునాయక్‌ను శుక్రవారం గిరిజన, ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, ఎస్సీ, బీసీ, మైనార్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకట్‌నాయక్, శీనునాయక్, వండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీకాంత్



శ్రీకాంత్

దేవరకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం బొడ్డుపల్లి గ్రామానికి చెందిన అంకూరి శ్రీకాంత్ ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో శ్రీకాంత్‌ను రాష్ట్రకమిటీ సభ్యునిగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియమించినట్లు శ్రీకాంత్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి



యాదవసంఘం సమావేశంలో మాట్లాడుతున్న ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్

దేవరకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి ఐక్యమత్యంగా ఉండాలని అఖిలభారత యాదవ మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలుయాదవ్ అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన యాదవ సంఘ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాదవులు రాజకీయాలల్లో రాణించాలన్నారు. ఈ నెల 29వ తేదీన దేవరకొండ వైష్ణవి ఫంక్షన్‌హాల్‌లో జరగనున్న చందంపేట, నేరేడుగొమ్ము మండలాల ముఖ్యనేతల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా మండలాల నూతన కమిటీలను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. యాదవులు అధిక సంఖ్య లో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యాదవ సంఘం చందంపేట మండల అధ్యక్షుడు వశ్య నారాయణ, మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, నాయకులు ఏర్పుల గోవిందు, నర్సింహయాదవ్, శ్రీశైలం యాదవ్, ఎన్‌వీటీ, గడ్డం వెంకటయ్య, యాదవసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

దామరచర్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి భైరం దయానంద్ అన్నారు. జీపీ కార్మికుల రాష్ట్ర కమిటీ పిలుపు మేర కు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మెలో భాగంగా శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెం.51ను సవరించాలని, జీవో నెం.60 ప్రకారం వేతనాలను చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు వాడపల్లి శ్రీరాములు, జైరుద్దీన్, సైదులు, బంటు నాగయ్య, జోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు లబ్ధి

నిడమనూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరంలాంటిదని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని ముప్పారం, వల్లభాపురం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మార్కెట్ కార్యాలయంలో ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముప్పారం మాజీ సర్పంచ్ ఆలంపల్లి మైసయ్య, రామలింగయ్య, వెంకటరమణ, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని పరామర్శించిన కంచర్ల



భాగ్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాడ్గులపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాతృమూర్తి భాగ్యమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం చర్లగూడెం గ్రామానికి చేరుకొని భాగ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సూదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెన్న శ్రవణ్ రెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

దేవరకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని మద్దెలమ్మ దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. దేవరకొండ పట్టణ ప్రజలు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మద్దెలమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్ర మాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి గంప ప్రవీణ్‌కుమార్‌శర్మ, నిర్వాహకులు నక్క వెంకటేష్‌యాదవ్, నల్లగాసు జాన్‌యాదవ్, వెంకటయ్య యాదవ్, నేతాళ్ల వెంకటేష్ యాదవ్‌తో పాటు నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలతో

అధిక దిగుబడులు

మిర్యాలగూడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చే యించి దానికి అనుగుణంగా సూక్ష్మపోషకాలు వినియోగించి అధిక దిగుబడుల ను పొందాలని సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో వికాస్ ఆగ్రో సంస్థ నిర్వహించిన జోనల్ డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధిక మోతాదులో యూరి యా, డీఏపీ వాడటం వల్ల భూమిలోని పోషకాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్నారు. రైతులు భూసార పరీక్షల ద్వారా ఏఏ పోషకాల కలిగిన మందులు వాడాలో తెలుస్తుందని అన్నారు. సూక్ష్మపోషకాలు వినియోగించడం వల్ల వరి దు బ్బులో ఎక్కువ పిలకలు వేసి అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. వి కాస్ ఆగ్రో ఎండీ కె.సత్యనారాయణ, ఆగ్రోస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

(5వపేజీ తరువాయి)

రాష్ట్రస్థాయి మహాసభల్లో విద్యారంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై చర్చించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, వాటి ద్వారానే నాణ్యమైన విద్యనందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మహాసభల్లో చర్చించి, తీర్మానిస్తారు. అదే విధంగా ఉపాధ్యాయుల సంక్షేమం, పెండింగ్ డీఏలు ఇతర సమస్యలపైనా చర్చించి ప్రభుత్వానికి సూచనలందజేసేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూటీఎఫ్ సమరశీల పోరాటాలతోనే రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దుకు నిర్ణయం తీసుకోవాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్ డీఏలు విడుద చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈ మహాసభల్లో మార్గనిర్దేశం చేస్తామని, రానున్న రెండేళ్లకు కార్యాచరణ కూడా రూపొందిస్తామని నిర్వాహకులు తెలిపారు.



నల్లగొండ క్లాక్‌టవర్ కూడలిలో ఏర్పాటు చేసిన యూటీఎఫ్ జెండాలు